తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక వార్త
30 వార్షికోత్సవం

# గణనాథుడిని దర్శించుకున్న కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి



కాణిపాకం, జులై 13 ప్రభాతవార్త:
కేంద్ర ఎన్నికల కమీషన్ కార్యదర్శి నవీన్‌కుమార్ సోమవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఇఓ పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజ గోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామి వారి సేవలో పాల్గొన్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలో సైతం వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి వేద మండపంలోని ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలు, చిత్రపటంను అందజేశారు. ఇదిలా వుండగా కాణిపాకం ఆలయ దర్శనార్థం వచ్చిన కేంద్ర ఎన్నికల కమీషన్ కార్యదర్శి నవీన్‌కుమార్‌కు దేవస్థానం అతిథి గృహం వద్ద కలెక్టర్ సుమిత్‌కుమార్ మొక్కను అందజేసి సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, ఆలయ ఎఇఓ రవీంద్రబాబు, ప్రొటోకాల్ ఎఇఓ ధనపాల్, సూపరిటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో
# ఇద్దరు యువకులు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకులు.

రేణిగుంట జూలై 13 ప్రభాతవార్త
కడప రేణిగుంట జాతీయ రహదారిపై రేణిగుంట మండలం మామండూరు వద్ద సోమవారం ద్విచక్రాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.... చిత్తూరు జిల్లా కెవిబిపురం దిగువ పుత్తూరు గ్రామానికి చెందిన రాజా (19), కేవీబి పురం మండలానికి చెందిన మరో యువకుడు వెంకటేష్ (19) ద్విచక్ర వాహనంపై కడప వైపు నుండి రేణిగుంట వైపుకు వస్తుండగా మామండూరు వద్ద అతివేగంగా ఎదురుగా వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న అర్బన్ పోలీసులు సంఘటనా స్థలం చేరుకొని మృతదేహాలను స్వాధీన పరుచుకొని శవ పరీక్ష నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు...

# తీరని సమస్యగా మారిన నెర్రి కాలువ

**- పరివాహక ప్రాంత ప్రజలకు మంచినీటి ముప్పు**



సూళ్లూరుపేట, జూలై 13 ప్రభాతవార్త:
పట్టణ నడిబొడ్డులో ప్రవహించే నెర్రి కాలువ పట్టణ ప్రజలకు తీరని సమస్యగా మారి వెక్కిరిస్తుంది. ఈ సమస్య మరికొద్ది రోజులు కొనసాగితే నెర్రి కాలువ పరివాహక ప్రాంతంలో నివసించే వారికి మంచినీటి ముప్పు తప్పేటట్లు లేదు. ప్రస్తుతం వేసవికాలం ను తలపించేలా ఎండలు బాగా కాస్తుండటంతో భూగర్భ జలాలు బాగా అడుగంటి పోయాయి. దీంతో నెర్రికాల్వ పరివాహక ప్రాంతంలోని ఉన్న బోర్లలోకి ఈ మురికి నీరు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అసలే సూళ్లూరుపేటలో మంచినీటి సమస్య ఎక్కువ ఉన్న ఈ కొద్దిపాటి మీరు కూడా కలుషితం అయిపోతే ప్రత్యామ్నయం ఏమిటి అని ప్రశ్న ప్రతి ఒక్కరిని ఆలోచింపజస్తుంది. మురుగునీటి సమస్యనెలకొని ఉన్నప్పటికీ, నాయకులు, అధికారులు తూతూ మంత్రంగా కంటిచూపు చర్యలు చేపట్టి ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రోజురోజుకీ పట్టణంలోని డ్రైనేజీ వాటర్ మొత్తం ఈ కాలువలోకి వదిలిపెట్టడంతో కాలువ మొత్తం కలుషితమై పెద్ద మురుగుగుంట్ల తయారైంది. గత పాతిక సంవత్సరాలుగా ఉన్న ఈ సమస్యను పరిష్కరించకుండా తాత్సారం చేయడంతో సమస్య బాగా ముదిరి తీవ్రస్థాయికి చేరుకుంది. దిగు ప్రాంత గ్రామాల్లో ఉండే ప్రజలు, రైతులు ఈ మురుగనీరుతో బాధలు పడలేక శ్రీ చెంగాలమ్మ దేవస్థానం వైపు నుంచి వాటంబేడు వెళ్లే మార్గంలో గల నేర్రి కాలువ లాకులను మట్టి వేసి పూడ్చివేశారు. దీంతో నెర్రికాల్వలోని మురుగునీరు నీరు మొత్తం శ్రీ చెంగాలమ్మ దేవస్థానం వెనుక భాగం నుంచి నాగరాజు పురం, శ్రీనగర్ కాలనీ,ఝాన్సీ నగర్,ఇందిరా నగర్, మహదేవయ్య నగర్, జివన్టి రోడ్డుతో పాటు చిన్న సత్రంవరకు మురుగునీటితో నిండిపోయింది. పెద్ద ఎత్తున దుర్వాసనతో పాటు పందులకు స్థావరంగా మారింది. దీంతో దోమల స్వైర్య విహారంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొన్ని రోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా దిగుప్రాంత రైతులను అధికారులను పిలిపించి మాట్లాడారు. లాకుల వద్ద నీటిని సూళ్లూరు చెరువు ప్రాంతం వైపు వెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. కానీ ఈ ప్రక్రియతో సూళ్లూరు ప్రాంత నివాసులు నివేదించి తిరిగి లాకులను మూసి వేయించారు. అక్కడి నుండి సమస్య మరింత జటిలమైంది. ఇదిలా ఉండగా నెర్రి కాలువ గట్టుపై ఆక్రమణలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. తమ ఇళ్లలోని డ్రైనేజీ వాటర్‌తో పాటు మరుగుదొడ్లను కూడా నేరుగా కాల్వలోకి వదిలి వేస్తున్నారు. అలాగే హోటల్లు ఇతర వ్యాపార సంస్థలు వారు కూడా ఈ కాలవను డ్రైనేజీ కాలువగా వాడుకుంటున్నారు. నేతలు అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బాలిక మిస్సింగ్ కేసును 15 నిముషాల్లో
# ఛేధించిన పెనుమూరు పోలీసులు

**- ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందిని అభినందించిన ఎస్పీ తుషార్ డూడి**

పెనుమూరు, జులై 13 ప్రభాతవార్త:
పాఠశాలకు వెళ్ళాల్సిన ఓ బాలిక పాఠశాలకు వెళ్ళకుండా కన్పించకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు స్పందించి 15 నిముషాల్లో బాలిక ఆచూకిని తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన మండల కేంద్రం పెనుమూరులో జరిగింది. వివరాలిలా వున్నాయి. మండలంలోని చార్వాకానిపల్లికు చెందిన 13 ఏళ్ళ విద్యార్థిని సోమవారం పాఠశాలకు వెళ్ళడానికి సిద్ధం అయ్యింది. అయితే స్కూల్ బస్సు తప్పిపోవడంతో ఆ బాలిక పిన్ని ఒక గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంలో పెనుమూరుకు పంపించింది. ఆ వ్యక్తి బాలికను పెనుమూరు చెక్‌పోస్టు కూడలి వద్ద దింపి వెళ్ళిపోయాడు. పాఠశాలకు ఆలస్యంగా వెళితే ఉపాధ్యాయులు మందలిస్తారని భయపడిన ఆ బాలిక పాఠశాలకు వెళ్ళలేదు. అలాగే తిరిగి ఇంటికి వెళితే తల్లిదండ్రులు కోపగించి కొడ్తారని భయపడిన ఆ విద్యార్థిని స్థానిక ఓహో హోటల్ సమీపంలో ఒంటరిగా కూర్చొంది. ఈ క్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని ఈ రోజు పాఠశాలకు రాలేదని ఫోన్ చేసి తల్లిదండ్రులకు చెప్పడంతో తల్లిదండ్రుల్లో కంగారు ప్రారంభమైంది. సత్వరం తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించడంతో ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి బస్టాండ్ కూడలి, చెక్‌పోస్టు పరిసరాల్లో వున్న సిసి కెమెరా ఫుటేజ్‌లను పరిశీలించారు. ఈ పరిశీనలో బైక్‌లో వచ్చిన వ్యక్తి విద్యార్థినిని చెక్‌పోస్టుకు సమీపంలో విడిచి పెట్టినట్లు స్పష్టం కావడంతో విద్యార్థిని స్కూల్‌కు వెళ్ళకుండా ఇక్కడే ఎక్కడో వుందని ఎస్ఐ శ్రీనివాస్ పోలీసులతో పరిసరాల్లో విస్తృతంగా గాలింపులు చేపట్టారు. ఈక్రమంలో విద్యార్థిని ఒక హోటల్ సమీపంలో కూర్చొని వున్న విషయంను గుర్తించిన ఎస్ఐ శ్రీనివాస్ ఆ విద్యార్థినిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతం అయ్యింది. పెనుమూరులో ఓ విద్యార్థిని తప్పిపోయిన పదిహేను నిముషాల్లోనే ఆమెను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించడంతో ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందిని ఎస్పీ తుషార్ డూడి అభినందించారు.

## టిడిపి పుంగనూరు సమావేశంలో
# పిడి గుద్దులు !



తిరుపతి, జూలై 13ప్రభాతవార్త:
తెలుగు దేశం పార్టీ తంబళ్ల పల్లి, పుంగనూరు ఇన్చార్జిల ఎంపిక కోసం సోమవారం తిరుపతి తిరుచానూరురోడ్డులోని ఓ హోటల్లో జరిగిన సమావేశంలో రక్తం చిందింది. ఇద్దరు రాష్ట్ర మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జనార్దన్ రెడ్డిలతో బాటు పరిశీలకుల సమక్షంలో జరిగిన సమావేశంలోనే తెలుగు తమ్ముళ్ళు జట్లు పట్టుకోవడం చర్చనీయాంశం అయ్యింది. తంబళ్లపల్లె ఇంచార్జి జయచంద్రా రెడ్డిని మద్యం కేసులో నిందితుడు కావడంతో తొలగించారు. ఇప్పుడు తిరిగి మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ ను నియమిస్తారని వార్తలు వచ్చాయి. దీంతో జయచంద్రా రెడ్డి వర్గం వాదనకు దిగింది. శంకర్ యాదవ్ వర్గం కూడ రంగంలోకి దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి.కాగా పుంగనూరు నియోజక వర్గం ఇంచార్జి చల్లా రామచంద్రా రెడ్డి ( బాబు) పని తీరు పట్ల అధిష్టానం అసంతృప్తితో ఉంది. ఈ నేపద్యంలో మధుసూదన నాయుడు, వెంకటరమణా రెడ్డి తదితరులు ఇన్‌చార్జి కోసం ప్రయత్నం ప్రారంభించారు. దీంతో చాలా మంది రామచంద్రా రెడ్డి వర్గం వాదనకు దిగింది. ప్రత్యర్థులు ఎదుర్కోవడంతో మరో వర్గంపై పిడి గుద్దులు గుద్దుకున్నారు. దీని కవరేజీ కోసం వెళ్ళిన మీడియా వారిపై దాడికి దిగారు. దీనితో మీడియా వారు ధర్నా చేసి తమను గాయ పరచిన వారిపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఇద్దరు మంత్రులు, టిడిపి రాష్ట్ర నాయకుల చేతకాని తనమే ఇందుకు కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదీ సిఎం చంద్రబాబు సోంత జిల్లాలో పార్టీలో తెలుగుతమ్ముళ్ల యవ్వారం దారుణానికి దారితీయడంతో మంత్రులపై సిఎం యాక్షన్ ఎలాంటిదో చూడాల్సి ఒదే

## గుడుపల్లె మండలంలో
# 67.98కోట్లతో రిజర్వాయర్ నిర్మాణం

**- కృష్ణాజలాలను లిఫ్ట్.. గ్రావిటీ ద్వారా చెరువులకు మళ్లించేందుకే !!**

**- సిఎం చంద్రబాబు ఆదేశాలతో కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ !!**

కుప్పం, జూలై 13 ప్రభాతవార్త
తన సొంత నియోజకవర్గం అయిన కుప్పం ప్రాంతంకు ఇప్పటికే కృష్ణాజలాలు తెచ్చి చరిత్ర సృష్టించిన సిఎం చంద్రబాబునాయుడు నియోజకవర్గంలో ఉన్న చెరువులన్నింటినీ కృష్ణాజలాలతో నింపాలని నిర్ణయించారు.ఇప్పటికే 110 చెరువులు కృష్ణాజలాలతో నిండాయి. మిగతా చెరువులను కూడా నింపేందుకు గుడుపల్లె మండలంలో కృష్ణాజలాలను నిల్వ ఉంచి చెరువులకు మళ్లించేందుకు రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకు ఇటీవలే సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో రాష్ట్ర కేబినెట్ రిజర్వాయర్ నిర్మాణంకు ఆమోదముద్ర వేసింది. ఈ ప్రాజెక్టుకు 67.98కోట్ల మేర నిధులు సైతం మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.0.025 టిఎంసిల నీళ్ల నిల్వ ఉండేలా ఈ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టనున్నారు. ప్రభుత్వం గుడుపల్లె మండలంలో కొత్తగా నిర్మించతలబెట్టిన రిజర్వాయర్‌ను యామిగానిపల్లి ప్రాంతంలో నిర్మించనున్నట్లు సమాచారం. ఇక్కడ రిజర్వాయర్ నిర్మించడంతో పాటు గుడుపల్లె మండలంలోని పొగురుపల్లి, దాసిమానిపల్లి, సి.గొల్లపల్లి, సంగనపల్లి పంచాయతీల్లో ఉన్న చెరువులకు హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ రిజర్వాయర్ నుంచి లిఫ్ట్ విధానంలో నీటిని మళ్లించనున్నారు. అలాగే జోగ్యానూరు చెరువు వద్ద నుంచి శెట్టిపల్లి, బెగ్గిలపల్లి, అగరం తదితర చెరువులకు గ్రావిటీతో నీటిని పంపినింపుతారు. అలా ఈ చెరువులన్నీ నిండితే దిగువన ఉన్న చెరువులకు కూడా కృష్ణాజలాలను అందించడం జరుగుతుంది. పొగురుపల్లి వద్ద ఉన్న పారిశ్రామిక వాడకు సైతం నీటి ఇబ్బందులు ఈ రిజర్వాయర్ నిర్మాణంతో తీరుతాయి. ముమ్మందు ఈ ప్రాజెక్ట రూపకల్పన దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టబోతోంది.

# గడువులోపు డిజిటలైజేషన్ పూర్తి - 'సర్' ప్రక్రియ వేగవంతం

**- కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్‌కుమార్**

ఐరాల, జులై 13 ప్రభాతవార్త:
గడువులోపు ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ పూర్తి చేయాలని కేంద్ర కమీషన్ కార్యదర్శి నవీన్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కాణిపాకం సమీపంలోని చినకాంపల్లి పోలింగ్ స్టేషన్‌లో 'సర్' ప్రక్రియ ఎలా సాగుతుందనే విషయంపై ఆయన కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి పరిశీలించి బిఎల్‌ఓలతో మాట్లాడుతూ అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్హుడైన వ్యక్తి ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ఇంటింటి సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో సర్ ప్రక్రియ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ సర్ ప్రక్రియ జిల్లాలో ఎలా జరుగుతుంది! ఎంత మేరకు పూర్తి అయ్యింది! పెండింగ్‌లో వున్న దరఖాస్తుల స్థితి, ఎవైనా ఫిర్యాదులు వున్నాయా! నిర్ణయాల నాణ్యత ఎలా వుంది! పరిశీలించి సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 97 శాతం సర్ ప్రక్రియ పూర్తయ్యిందని దాదాపు 40 వేల దరఖాస్తులు పెండింగ్‌లో వున్నాయని తెలిపారు. వీటిలో కొన్ని వెంటనే పరిష్కరిస్తున్నట్లు మిగిలిన మూడు శాతం దరఖాస్తులను మంగళవారం మధ్యాహ్నం లోపు పూర్తి చేసే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో మిగిలిన పెండింగ్ పనులను పూర్తి చేసి ఎన్నికల సంఘానికి సమగ్ర నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్డీఓ శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, చిత్తూరు మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, ఐరాల తహసిల్దారు, బిఎల్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతే ప్రథమ ప్రాధాన్యం: డీఈవో

## హెచ్ఎంఎం ఎయిడెడ్ పాఠశాల కరెస్పాండెంట్‌పై వేటు



తిరుపతి విద్య జూలై 13 ప్రభాత వార్త
విద్యార్థిపై అమానుషంగా ప్రవర్తించడం, శారీరకంగా హింసించడం, అంతేకాకుండా పాఠశాల పని వేళల్లో సిగరెట్లు, అగ్గిపెట్టెలు తెప్పించేవారన్న తీవ్రమైన ఆరోపణలు రుజువుకావడంతో తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండలంలోని హెన్రీ మేయర్ మెమోరియల్ (హెచ్ఎంఎం) ఎయిడెడ్ ఉన్నత పాఠశాల కరెస్పాండెంట్ కె. దేవసుందరంపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంది. విచారణాధికారి సమర్పించిన నివేదిక ఆధారంగా ఆయనను కరెస్పాండెంట్ పదవి నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) కె.వి.ఎన్. కుమార్ సోమవారం తెలిపారు.డీఈవో వివరాల ప్రకారం.. అదే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వై. రోహిత్ కుమార్ అనే విద్యార్థిని కె. దేవసుందరం కాళ్లతో తన్నుతూ శారీరకంగా హింసించినట్లు, పాఠశాల సమయాల్లో సిగరెట్లు, అగ్గిపెట్టెలు కొనుగోలు చేసి తీసుకురావాలని ఒత్తిడి చేసేవారన్న ఆరోపణలు జిల్లా యంత్రాంగం దృష్టికి వచ్చాయి. ఈ ఫిర్యాదులను ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించి, వాస్తవాలను నిర్ధారించేందుకు ప్రత్యేక విచారణకు ఆదేశాలు జారీ చేసింది.నియమిత విచారణాధికారి బాధిత విద్యార్థి, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది, ఇతర సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలు నమోదు చేయడంతో పాటు అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించి సమగ్ర నివేదికను జిల్లా అధికారులకు సమర్పించారు. ఆ నివేదికలో పేర్కొన్న అంశాలను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ కె. దేవసుందరంపై పరిపాలనా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.దీనిలో భాగంగా హెన్రీ మేయర్ మెమోరియల్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల కరెస్పాండెంట్ బాధ్యతల నుంచి కె. దేవసుందరంను తక్షణమే తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈవో కె.వి.ఎన్. కుమార్ తెలిపారు. అలాగే పాఠశాల పరిపాలనలో ఎలాంటి అంతరాయం కలగకుండా, విద్యార్థుల విద్యాభ్యాసం ప్రభావితం కాకుండా ఉండేందుకు తిరుపతి ఉప విద్యాశాఖాధికారిని (డిప్యూటీ ఈవో) ప్రత్యేక అధికారిగా (స్పెషల్ ఆఫీసర్) నియమించినట్లు వెల్లడించారు.విద్యార్థులపై వేధింపులు, శారీరక దౌర్జన్యాలు, బాలల హక్కులకు విరుద్ధంగా జరిగే ఏ చర్యనైనా ప్రభుత్వం సహించబోదని డీఈవో స్పష్టం చేశారు. పాఠశాలలు విద్యార్థులకు భద్రత, క్రమశిక్షణ, నైతిక విలువలు అందించే కేంద్రాలుగా ఉండాలని, ఆ బాధ్యతను విస్మరించి వ్యవహరించే వారిపై చట్టం, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత విషయంలో జిల్లా యంత్రాంగం రాజీపడే ప్రసక్తే లేదని డీఈవో కె.వి.ఎన్. కుమార్ పేర్కొన్నారు.

# అనాలోచిత విధానాలతో... ఆలయ ఆదాయానికి గండి

**-'పుస్తకం ఏర్పాటుతో 'శివయ్య ఆదాయాలకు గండి'**



శ్రీకాళహస్తి,జూలై 13 ప్రభాతవార్త:
శ్రీకాళహస్తీశ్వరాయంలో రాజకీయ నాయకులు, పాలకులు, అధికారుల అనాలోచిత విధానాలతో ఆలయ ఆదాయానికి గండి పడుతుంది గతంలో ఎన్నడూ లేని విధంగా నేడు శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారుల అడ్డగా మారింది. గత కొన్ని నెలలుగా అదుపు ఆపు లేకుండా మారింది. రోజు రోజుకు ఆలయంలో ఉచిత సేవకుల సంఖ్య పెరుగుతుంది. వీరందరూ ఎవరి సిఫార్సులతో ఇక్కడ చేరుతున్నారో ఆ ముక్కంటీశునికే ఎరుక. ఆలయం 'ఉపాధి కేంద్రంగా' మారి, చేరిన వారు ఆదాయమే ప్రధానంగా భక్తులను ఆకర్షించుకుంటూ శివయ్య ఆదాయాలకు గండికొడుతున్నారు. అయితే ఈ ఆలోచనల్లో ఆంతర్యమేమిటన్నది ఎవరికి అంతుపట్టడం లేదు. పాలకులు తీసుకుంటున్న విధానాలతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందనే విషయాన్ని గుర్తించాల్సి ఉంది.

**పుస్తకం ఏర్పాటుతో ఆదాయాలకు గండి:**

ఇక శ్రీకాళహస్తీశ్వరాలయంలోని ప్రధాన గడప వద్ద ఇటీవల పాలకుల సూచనలతో 'పుస్తకాన్ని (రిజిస్టర్) ఏర్పాటు చేసారు. ఈ పుస్తకాన్ని ఏ ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసారో ఏమోకానీ, దీని వల్ల శివయ్య ఆదాయాలకు గండి పడిందనేది జగమెరిగిన సత్యం. పుస్తకం ఏర్పాటు చేయటానికి ముందు దళారులు ఒకటి అర టిక్కెట్లు కొనుగోలు చేసి పార్టీలను పిలుచుకొని వెళ్ళే వారు. కానీ పుస్తకం ఏర్పాటు చేసిన తరువాత దళారులు 'రాసుకో' పేరు అంటూ వెళుతున్నారు. అయితే కంచుగడప వద్ద ఉంటున్న రక్షక దళాలు కూడా ఏమి చేయలేక మౌనం వహిస్తున్నారు. పాలక మండళ్ళ నియామకం ఆలయాల్లో చోటు చేసుకున్న ఒడుదుడుకులను సరిదిద్దటానికి ఏర్పాటు చేస్తారు. అయితే అనాలోచిత విధానాలతో శివయ్య ఆదాయాలకే సరాసరి గండి కొడుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే శివయ్య ఆదాయాలు కేవలం రాహుకేతుదోష నివారణ పూజల టిక్కెట్లు మాత్రమే మిగులుతుంది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారుల దందా పెరిగిపోతుందనే విమర్శలు రాజ్యమేలుతుంటే మరో వైపు ఇక్కడ ఉచిత సేవకుల ముసుగులో ఆలయంలో ఓ దౌర్జన్యకర వ్యవస్థ ఏర్పడుతుంది. వీరిని చూస్తే సిబ్బంది వణుకుతున్నారు. వారిని ఆపే సాహసం కూడా చేయలేకపోతున్నారు. వారు వస్తున్నారంటే క్యూలైన్లలో ఎంత రద్దీ ఉన్నా గేట్లు బార్లా తెరచుకోవాల్సిందే. లేదంటే చరవాణిలో మాట్లాడు అంటూ సిబ్బందిని రాజకీయ నాయకుల పేరుతో హడలెత్తిస్తున్నారు. దాంతో సిబ్బందిపై భక్తులు దాడి చేసినా పర్వాలేదన్నట్లు దళారులకు 'ఎర్రతివాచి' పరుస్తున్నారు. ఆంక్షలున్న చోటకు కూడా వెళుతున్నారు. కానీ ఆపే ధైర్యం సిబ్బందికి లేదు, కారణం అధికారుల మద్దతు లేదు. శ్రీకాళహస్తీశ్వరుని ఆదాయం కంటే దళారుల రాబడే అధికంగా ఉంటుందని పరిశీలకులు చెబుతున్నారు. ఒక్కొక్క పార్టీకి ఒక్కక్క చోట ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. రక రకాల దర్శనాల పేర్లు చెబుతూ కాంటాక్టు చేసుకుంటున్నారు. దాంతో శివయ్య బూడిదే చాలన్నట్లు దళారులు జేబులు నింపుకుంటున్నారు. ఎవరైనా అడ్డగిస్తే ఏదో ఒక రాజకీయ నాయకుడి పేరుతో పబ్బం గడుపుకుంటున్నారు. అయితే దళారులక సంబంధించి పాలకులు పెదవి విప్పటం లేదు.

# భర్త వేధింపులు తాళ లేక భార్య ఆత్మహత్య

తిరుపతి, జూలై 13ప్రభాతవార్త:
న భర్త వేధింపుల తాళలేక భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దకాపు లేఔట్ లో చోటచేసుకుంది. మృతురాలు జె. శాంతి (26)గా పోలీసులు గుర్తించారు. పెళ్లయిన 11 నెలలకే పిల్లలు పుట్టలేదని భర్త వేధింపులు తాళలేక ఉరివేసుకొని మృతి చెందినట్లు పోలీసులు సమాచారం. మృతదేహాన్ని రుయా మార్చురీలు పోస్ట్ మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. బంధువుల ఫిర్యాదు మేరకు ఈస్ట్ ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

14 CTR 2:14 CTR 2.qxd 7/13/2026 10:52 PM Page 1



# కుప్పం కోర్టులో కేసుకు హాజరైన ఎమ్మెల్యే అమర్



కుప్పం, జూలై 13 ప్రభాతవార్త

2021లో నమోదైన ఒ కేసుకు సంబంధించిన విచారణ నిమిత్తం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి, స్థానిక నేతలు సోమవారం కుప్పం కోర్టుకు హాజరయ్యారు. అయితే ఈనెల 17వతేదికి న్యాయమూర్తి కేసును వాయిదా వేశారు. 2021 సెప్టెంబర్ 16న శాంతిపురంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద చేపట్టిన ర్యాలీకి సంబంధించి వీఆర్వో రామిరెడ్డి ఫిర్యాదు మేరకు రాళ్లబూదుగూరు పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, సిఎం మాజీ పిఎ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులుతో సహా 28మందిపై అప్పట్లో కేసు నమోదైంది. ఈ కేసులో ముగ్గురు వ్యక్తులు మృతి చె ందడంతో మిగతా పాతిక మంది కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరయ్యారు.

# నవోదయ ప్రవేశంపై తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన

## - కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరుహెల్త్, జూలై 13 ప్రభాతవార్త:

జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2027 విద్యా సంవత్సరానికి సంబంధించి జవహర్ నవోదయ విద్యాలయ సెలెక్షన్ టెస్ట్(జెఎన్‌విఎస్‌టి)-2027 ప్రవేశాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశాలకు ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, దీనికి సంబంధించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ప్రవేశ ప్రక్రియపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అలాగే అన్ని పాఠశాలల ద్వారా ప్రచారం నిర్వహించి అర్హులైన ప్రతి విద్యార్థి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునే వారు జులై 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వీరికి నవంబర్ 28వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు.

# రైతుకు వేరుసెనగ విత్తనం పంపిణీ చేయాల్సిందే

## - ఎంపిపి హేమలతా సురేష్‌రెడ్డి డిమాండ్

పెనుమూరు, జులై 13 ప్రభాతవార్త: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు పంపిణీ చేయాల్సిందేనని ఎంపిపి హేమలతా సురేష్‌రెడ్డి ప్రభుత్వంను డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాధార పంటగా జిల్లాలో సాగు అయ్యే వేరుసెనగ పంటను విత్తడం కోసం వ్యవసాయశాఖ సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తుందని ఆశతో రైతులు గత రెండు నెలలుగా ఎదురు చూస్తున్నారన్నారు. అయితే వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యం, తప్పుడు నివేదికల కారణంతో మండలాల్లోని రైతులకు పంపిణీ చేయాల్సిన సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు ఇప్పటికీ పంపిణీ చేయకపోవడం దారుణం అన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు మెప్పు పొందడానికి వ్యవసాయ శాఖ అధికారులు సిఎం సొంత నియోజకవర్గం కుప్పంలోని అన్ని మండలాల్లోని రైతులకు విత్తనాలు పంపిణీ చేసి జిల్లాలోని మిగిలిన మండలాలకు పంపిణీ చేయకుండా నిలుపుదల చేయడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. మండలాల్లో విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో అత్యధిక రైతులు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్ళి అధిక ధరలు చెల్లించి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారన్నారు. గతంలో వైకాపా ప్రభుత్వం వర్షాలు కురిసినా కురవకపోయినా ఖరీఫ్ సీజన్‌లో రైతులకు వేరుసెనగ విత్తనాలు పంపిణీ చేసిందనే విషయంను ఆమె గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం రైతులను విస్మరించి వారి పట్ల చిన్నచూపు చూడటం తగదని ఆమె పేర్కొన్నారు.

# పోలీసు గ్రీవెన్స్‌కు 64 సమస్యలు



చిత్తూరు, జులై 13 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పోలీసు పాత కార్యాలయంలో ప్రతి సోమవారం ఎస్పీ తుషార్ దూడి ఆధ్వర్యంలో నిర్వహించే పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు ఈ వారం ప్రజల నుండి 64 సమస్యలపై అర్జీలు అందాయి. ఎస్పీ తుషార్ దూడి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలు హాజరై తమ సమస్యలను ఎస్పీకి విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పక్కాగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు జిల్లాలోని ప్రజల నుండి మొత్తం 64 సమస్యలు అందాయి. అందులో అత్యధికంగా భూతగాదాలకు సంబంధించి 18, ఆర్థిక లావాదేవిలు 10, ఆస్తి తగాదాలు 8, పోలీసు సేవలు 8, ఇంటి తగాదాలు 6, వేధింపులు 6, చిన్న గొడవలు 3, దొంగతనం 2, ద్విచక్రవాహన దొంగతనం, చీటింగ్, ఇంటి తగాదాలుపై ఒకొక్క అర్జీ అందాయి.

# మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి రూ.1 లక్ష అందజేసిన ఎస్పీ



చిత్తూరు, జులై 13 ప్రభాతవార్త:

గుడిపాల పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఎంఎస్ మురళీ సతీమణి ఎం.రేఖకు సోమవారం ఎస్పీ తుషార్ దూడి ఐడిఆర్‌ఎఫ్ ఫండ్ నుండి రూ.1 లక్ష చెక్కును అందజేశారు. చిత్తూరు జిల్లా సాయుధదళ కార్యాలయంలో సోమవారం హెడ్‌కానిస్టేబుల్ సతీమణి రేఖ ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ రూ.1 లక్ష చెక్కును అందజేసి బాధిత కుటుండానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాన్ కేడర్ ఎస్పీ అడ్మిన్ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ రైతులకు లాభం కలిగించాలి



శాంతిపురం, జూలై 13 ప్రభాతవార్త

ప్రకృతి వ్యవసాయ రైతులకు లాభం కలిగించాలని నోడల్ అధికారి బాజీబాబు సూచించారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆర్‌వైఎస్ఎస్- ఎపిసిఎన్‌ఎఫ్ సిబ్బందితో ప్రకృతి వ్యవ సాయ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిం చారు. ఎటిఎం మోడల్, ఎ గ్రేడ్ మోడల్, పిఎండిఎస్ కార్యక్రమాల అమలు, ప్రగతి, రైతుల భాగస్వామ్యంపై సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు చేసి మారె ్కటింగ్‌అనుసంధానంతో రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ పవన్‌కుమార్, దుర్గ, ఎఫ్‌ఎంటిలు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి

## - కడ ఎపిడి శ్రీనివాసులు రాజు

కుప్పం, జూలై 13 ప్రభాతవార్త




ప్రజా సమస్యలను అధికారులు సత ్వరం పరిష్క రించాలని కడ ఎపిడి శ్రీనివా సులు రాజు అధికారులను ఆదేశించారు. కడ పి.డి. వికాస్ మర్మత్ ఆదేశాలతో సోమవారం స్థానిక మండల కార్యాలయంలో కడ ఎపిడి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కార్యక్రమంను నిర్వహించారు. పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు ఈ కార్యక్రమంకు హాజరై ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు 71 అర్జీలను సమర్పించారు. అనంతరం కడ ఎపిడి శ్రీనివాసులురాజు, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో అధికారులు ప్రజల సమస్యలపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి వాటిని పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా, బాధ్యతాయుతంగా సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సమస్యలను నిర్దిష్ట కాలపరిమితిలోగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కార్పోరేషన్ డైరెక్టర్ మణి, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, మాజీఎంపిపి డాక్టర్ వెంకటేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కుప్పం ఇంజనీరింగ్‌కాలేజ్‌కు ప్రతిష్టాత్మక అవార్డులు




కుప్పం, జూలై 13 ప్రభాతవార్త

కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ రెండు ప్రతిష్టాత్మక అవార్డులు కైవశం చేసుకున్నట్లు బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ డాక్టర్ బిసి నాగరాజ్, కెఇసి వైస్‌ఛైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్ తెలిపారు. జనవరి -ఏప్రిల్ 2026 సెమిస్టర్‌లో ఎన్పీటెల్ ఆన్‌లైన్ కోర్సుల్లో అత్యుత్తమ పనితీరు కనబరచినందుకు కెఇసికి ఆస్పిరెంట్ అవార్డును మద్రాస్ ఐఐటిలో కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆండ్రూ తంగరాజ్ తమ కళాశాల ఎస్పీఒసి డాక్టర్ రాసదురైకు అందించారన్నారు. అలాగే సమాజసేవ, సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ లియో క్లబ్ ఫ్యూచర్ లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో జరిగిన ఉద్భవ అవార్డులో భాగంగా మెంబర్‌షిప్ గ్రోత్ ఎక్సలెన్స్ అవార్డును లయన్ అశ్వత్ నారాయణస్వామి చేతుల మీదుగా అందుకున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌బాబు,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరన్, ఆర్‌అండ్‌డి డైరెక్టర్ డాక్టర్ కోదండరామయ్య, హెచ్‌ఓడిలు మాధవన్, శరవణ,పిఒ గంగాధరన్, డాక్టర్ అరుణ్‌కుమార్, పిఆర్వో ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 'సర్' పేరిట ఓట్లు తొలగింపు

## - జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు

చిత్తూరుహెల్త్, జులై 13 ప్రభాతవార్త:



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) పేరిట జిల్లాలో అర్హత గల ఓటర్లను ప్రభుత్వం తొలగించడానికి చర్యలు తీసుకుంటుందని ఇది ప్రభుత్వానికి ఏ మాత్రం తగదని జిల్లా సిపిఐ కార్యదర్శి నాగ రాజు ధ్వజమెత్తారు. చిత్తూరు సిపిఐ కార్యాలయంలో సోమ వారం జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు అధ్యక్షతన సిపిఐ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యంగం కల్పించిన అత్యున్నతమైన ప్రాథమిక ఓటు హక్కును కాపాడుకోకపోతే ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీలు కొల్పోయే పరిస్థితి వుంటుందన్నారు. దేశంలో ఎన్నికల సంఘం రెండు దశల్లో చేపట్టిన 'సర్' వల్ల వివిధ రాష్ట్రాల్లో 6.50 కోట్ల ఓట్లు ఓటర్ల జాబితా నుండి తొలగించడం జరిగిందన్నారు. ప్రస్తుతం 3వ దశలో 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో 'సర్' ప్రక్రియ జరుగుతున్నదని, దీని వల్ల ఓటరు జాబితా నుండి ఓటర్ల పేర్లు గల్లంతు అయ్యే అవకాశం వుందన్నారు. 1951 నుండి ప్రతి 20 సంవత్సరాలకు ఒకసారి ఓటర్ల సర్వే జరుగుతున్నదని, ఈ సర్వేల్లో ఎప్పుడు ఓటర్ల నుండి ఎలాంటి డాక్యుమెంట్లు అడగలేదని, ప్రస్తుతం 2002ను ప్రామాణికంగా తీసుకుని ఓటర్ల నమోదు కార్యక్రమంను బిఎల్‌ఓల ద్వారా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంను బిఎల్‌ఓలు, బిఎల్‌ఓలు తూతూ మంత్రంగా చేపట్టడం వల్ల నిరక్షరాస్యులు, వలస కార్మికులు, మహిళలు, సంచార జాతులు, దళితులు, మైనార్టీలు, సెక్యులర్ భావాలు కల్గిన వేలాది ఓటర్ల పేర్లు జాబితా నుండి గల్లంతు అయ్యే అవకాశం వుందన్నారు. ఓటర్ల బాధలు, ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని 'సర్' గడువును మరో మూడు నెలల పాటు పొడగించాలని ఆయన డిమాండ్ చేశారు.

# కాణిపాకం ఆలయంకు రూ.1 లక్ష విరాళం

కాణిపాకం, జులై 13 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంకు ఓ భక్తుడు లక్ష రూపాయలను సోమవారం విరాళంగా అందజేశారు. ఈ మేరకు హైదరాబాదుకు చెందిన రాజీరెడ్డి అనే భక్తుడు దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం అమలు జరుగుతున్న శాశ్వత నిత్యఅన్నదాన పథకంకు రూ.50,116, శ్రీ సిద్ధి వినాయక గో సంరక్షణ పథకానికి రూ.50,116లను విరాళంగా అందజేశారు. ఈ మొత్తంను దాతలు కుటుంబసభ్యులతో కలిసి ఆలయ సూపరిటెండెంట్ వాసుకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 29న కాణిపాకంలో శాఖాంబరి అలంకారం

కాణిపాకం, జులై 13 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీ మరగదాంబిగా సమేత మణికంఠేశ్వరాలయంలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 29న శాఖాంబరి అలంకారం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఇఒ కె.పెంచల కిషోర్ తెలిపారు. ప్రతి ఏటా ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఆలయంలో శాఖాంబరి అలంకారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆలయంలోని శ్రీ మరగదాంబిగా దేవి, శ్రీ దుర్గాదేవి అమ్మవార్లతో పాటు ప్రధాన ఆలయం నందు వివిధ రకాల కూరగాయాలు, పండ్లతో శాఖాంబరి అలంకారం నిర్వహించి పూజలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఉదయం 6 గంటల నుండి భక్తులకు దర్శనం వుంటుందన్నారు. శాఖాంబరి అలంకారంకు కావాల్సిన వివిధ రకాల కూరగాయాలు, పండ్లను భక్తులు విరాళంగా దేవస్థానంను ఈ నెల 28వ తేదీలోపు ఆలయంలోని అర్చకుల వారికి సమర్పించాలని సూచించారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై సమావేశం



పూతలపట్టు, జూలై 13, ప్రభాతవార్త

మండల తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ ఉదయ్ సంతోష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయినా మాట్లాడుతూ రేపటితో మ్యాపింగ్ ప్రక్రియకు చివరి రోజు కాబట్టి మన పూతలపట్టు నియోజకవర్గంలో పార్టీ తరపున ఇంకా ఎవరి మ్యాపింగ్ అయినా మిగిలి ఉంటే, రేపే పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి మ్యాపింగ్‌ను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ ఆర్ ఓ విజయలక్ష్మి, అన్ని పార్టీ నాయకులు హాజరయ్యారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

# థియో స్టీఫెన్స్‌కు డా.బి.ఆర్ అంబేద్కర్ జాతీయ పురస్కారం




చిత్తూరురూరల్, జూలై 13 ప్రభాతవార్త:

గుంటూరు నందు దళిత ఓపెన్ యూనివర్శిటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన 40వ స్నాతకోత్సవంలో రీడ్స్ అధ్యక్షుడు, డైరెక్టర్ థియో స్టీఫెన్స్‌కు వైస్ చాన్సలర్ ఆచార్య డా.కృపాచారి, ఛైర్‌పర్సన్ డా.స్వర్ణలతలు ప్రతిష్టాత్మకమైన డా.బి.ఆర్.అంబేద్కర్ జాతీయ పురస్కారంను ప్రదానం చేసారు. థియో స్టీఫెన్స్ మాట్లాడుతూ ఈ గౌరవం వ్యక్తిగతంగా నాకు మాత్రమే కాదనీ, సమాజ మార్పు కోసం జీవితాన్ని అంకితం చేసిన రీడ్స్ వ్యవస్థాపకులు దివంగత మార్టిన్ లూథర్ స్టీఫెన్స్ ఆశయాలకు, రీడ్స్ బృందానికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానన్నారు. డా.బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా విద్య సమానత్వం, సామాజిక న్యాయం, దళిత సాధికారత కోసం మా సేవలను మరింత విస్తరిస్తామని పేర్కొన్నారు. కాగా థియో స్టీఫెన్స్‌కు రీడ్స్‌సంస్థ సభ్యులు, భాగస్వామ్యసంస్థలు, శ్రేయోభిలాషులు తదితరులు అభినందనలు తెలిపారు.

# తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన అమీన

చిత్తూరురూరల్, జూలై 13 ప్రభాతవార్త:




తుమ్మిందపాళ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదువుతున్న అమీన తన పుట్టిన రోజు గుర్తుగా పాఠశాల ఆవరణలో మొక్కను నాటి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు హెచ్ అరుణశివప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు సుజాతలు తెలిపారు. అమీన మాట్లా డుతూ జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు అరుణ శివప్రసాద్ మాటలను ప్రేరణగా తీసుకొని మొక్కను నాటానని, మొక్క సంరక్షణ బాధ్యతను సైతం తాను తీసుకొంటానని తెలిపింది. విద్యార్థులందరూ అమీనాను స్ఫూర్తిగా తీసుకొని కేకులు కోసి సమయాన్ని, డబ్బును వృధా చేయకుండా పర్యావరణానికి మేలు చేసేలా మొక్కలు నాటాలని ప్రధానోపాధ్యాయురాలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవి, అరుణశివప్రసాద్, అమర్నాథ్,ఈశ్వరి, శశిధర్‌లు పాల్గొన్నారు.

# రైతులకు రాయితీతో కూరగాయ మొక్కలు : ఎడి పల్లవి

కుప్పం, జూలై 13 ప్రభాతవార్త

కుప్పంలోని సెంటర్‌ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సిఒఇ)లో రైతులకు కూరగాయల మొక్కలను రాయితీతో అందించడం జరుగుతుందని ఉద్యానవనశాఖ, సిఒఇ ఎడి పల్లవి తెలిపారు. మొక్కలు అవసరమైన రైతులు తమ ఆధార్, పాస్‌పుస్తకం నకళ్లను మండలాల్లోని ఉద్యానవన అధికారుల వద్ద దరఖాస్తులు తీసుకుని వస్తే వారికి రాయితీతో మొక్కలు అందించడం జరుగుతుందన్నారు. టమోటా రకం (సాహో,సాహిత్ 234) రూ.20పైసలు, కాకర 50పైసలు, వంకాయ, బీర, సొరకాయ, కాకర మొక్కలు పూర్తి ఉచితంగా అందిస్తామన్నారు. అలాగే వాటర్ మిలన్ మొక్కలు 50పైసలకు, ఎన్ఎస్ 295రకం పూర్తి ఉచితంగా అంది ంచడం జరుగుతుందన్నారు. ముందుగానే రైతులు తమకు అవసరమైన మొక్కలకు సిఒఇలో ఆర్డర్ పెట్టాలని సూచించారు.

# కుప్పంలో పోలీసులచే ఫుట్ పెట్రోలింగ్



కుప్పం, జూలై 13 ప్రభాతవార్త

జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, డిఎస్పీ పార్థసారథి ఆదేశాల మేరకు సోమ వారం సాయంత్రం కుప్పం పట్టణంలో రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, అర్బన్ ఎస్సై బాబు సిబ్బందితో కలసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సంద ర్భంగా పట్టణంలో ట్రాఫిక్‌ను క్రమబ ద్ధీకరించడంతో పాటు ట్రాఫిక్ నియమా లు ఉల్లంఘించిన పలువురికి జరిమానా విధించారు. ప్రజల భద్రత కోసమే పోలీసు శాఖ పనిచేస్తోందని ప్రజలు కూడా పోలీసు శాఖకు సహకరించాలని సిఐ కోరారు.

# కేరళం రాష్ట్రంలో కె.పి.మిట్ట వాసి మృతి

శాంతిపురం, జూలై 13 ప్రభాతవార్త



శాంతిపురం మండలం మఠం పంచాయతీ కె.పి. మిట్ట గ్రామంకు చెందిన సలీమ్ (27) అనే వ్యక్తి కేరళం రాష్ట్రంలో మృతి చెందాడు. ఇతను కేరళంలో విహారయాత్రకు వెళ్లి ప్రమాదవశాత్తు అక్కడ జలపాతంలో పడిమృతి చెందినట్లు తెలిసింది. కేరళం రాష్ట్రం మున్నార్ సమీపంలోని ఆడిమల తలుక్ హాస్పిటల్‌లో సలీమ్ మృతదేహం ఉన్నట్లు బంధువులకు సమాచారం అందడంతో వారు హుటాహుటిన కేరళంకు బయలుదేరారు. మృతుడు విజలాపురంలో ఓ ప్రైవేట్ వ్యక్తి వద్ద పనిచేస్తుండగా ఆ వ్యక్తి అక్కడ పనిచేసేవారిని విహారయాత్రకు తీసుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా మృతుడికి ఇద్దరు పిల్లలు కలరని తెలిసింది. పూర్తి విషయాలు తెలియాల్సి ఉంది.

# ఉచిత కంటి చికిత్సా శిబిరానికి విశేష స్పందన

పలమనేరు, జూలై 13, ప్రభాతవార్త:

పలమనేరు పట్టంలోని బాలాజీ టవర్స్ వద్ద ఉచిత కంటివైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తోంది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, చెన్నై శంకరనేత్రాలయ, బైరెడ్డిపల్లె మహతి ఫౌండేషన్. అరవింద్ క్రిష్ణస్వామి, జయాక్రిష్ణ స్వామి (యుఎస్ఎ) వారి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ నెల 10 నుండి 16 వరకు కంటి పరీక్షలు, 14 నుండి 8 వరకు కంటి ఆపరేషన్లు ఉంటాయి. ఇప్పటి వరకు 257 మందికి కంటిపరీక్షలు చేయగా 74 మందికి శుక్లం శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. 33 మందిని ఆపరేషన్లు చేయడానికి చెన్నైశంకరనేత్రాలయ ఆసుపత్రికి రెఫర్‌చేశారు. అర్హులైన వారికి శంకర నేత్రాలయ మొబైల్ ఐ సర్కిల్ యూనిట్ ద్వారా కంటిపొరలు తొలగించి లెన్స్, మందులు, నల్ల కళ్ళ అద్దాలు ఇతర అసవరమైన సేవలు అందజేస్తారు. శిబిరం ఇంకా కొనసాగుతోంది కాబట్టి కంటి పొర శుక్లం సమస్యలు ఉన్న వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

## విద్యార్థులు కష్టపడి చదవాలి

### - టిడిపి నాయకుడు జలీల్ అహ్మద్

**కోట, జూలై 13 ప్రభాతవార్త** విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదువు కోవాలని జిల్లా తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్ అన్నారు. సోమవారం స్థానిక ఎవికెఆర్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ (సిఎస్ ఆర్ పండ్స్) చొరవతో ఏర్పాటు చేసిన సైకిళ్లను జలీల్ అహ్మద్ బాలికలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఇంట్లో ఎంతమంది చదువుకుంటే అంతమందికి తల్లికి వందనం కింద తల్లుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.13 వేలు చొప్పున ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. తల్లికి వందనం కార్యక్రమాన్ని ఈ నెల 17న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రంపచోడవరంలో ప్రారంభిస్తారని తెలిపారు. 10వ తరగతి అనంతరం ఇంటర్మీడియట్‌లో చదివే విద్యార్థులకు హైస్కూల్లోనే ఇంటర్ కోర్సులు చదివేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు హైస్కూళ్ల కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నారని పేర్కొన్నారు. బాగ చదువుకొని జిల్లా స్థాయిలో కోట మండలంలో ఫలితాల్లో ఆదర్శంగా నిలవాలని జలీల్ ఆహ్మద్ కోరారు. వంజివాక, పెద్దగొవిందపల్లి, గూడలి, చిట్టేడు, కొత్తపాలెం, కొక్కుపాడు, కోట బాలురు, బాలికల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు 594 సైకిళ్లను ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు సునిల్‌కుమార్‌కు విద్యార్థునులు ధన్యావాదాలు తెలిపారు. ఈ సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో విద్యార్థునులు తల్లిదండ్రులు పాల్గొనడంతో ఓ పండగ వాతావరణంలో కనబడింది. ఈ కార్యక్రమంలో కోట మండల టిడిపి అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, ఎంఇఓ మస్తానయ్య, ప్రధానో పాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, ఎఎంసి చైర్మెన్, డి.ప్రమీల, మాజీ మండలాధ్యక్షులు నల్లపరెడ్డివినోద్ కుమార్‌రెడ్డి, కె.రమేష్, ఎం.సర్వోతమ్‌రెడ్డి నెల్లూరుమోహన్‌రెడ్డి, కె.మధుయాదవ్, మండల ప్రధాన కార్యదర్శి తిరుమల శెట్టి కోటేశ్వరరావు, మోబిన్‌బాషా, చిన్నయ్య, నౌషాద్, పి.వెంకటకృష్ణారెడ్డి, తిరుమూరు మురళి, చెంగల్‌రావు, లక్ష్మీనారయణ, చల్లా సురేష్, ఎంపిటిసిలు షంషుద్దిన్, సురేష్, మహిళా నాయకురాలు పోలమ్మ, సుహాసిని, మోహన్, తదితరులు పాల్గొన్నారు.



## హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యేకు ధన్యవాదాలు

### హైస్కూల్ ఉపాధ్యాయు బృందం

**కోట, జులై 13 ప్రభాతవార్త** కోట ఎవికెఆర్ జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో ప్లస్ 2 ఇంటర్మీమి డియట్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఎప్రిల్ నెలలో ఈ సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా స్దానిక శాసన సభ్యులుపాశిం సునిల్‌కుమార్ హాజరైయ్యారు. ఈ సందర్బంగా పాఠశాలలో మౌలిక వసతులు లేక ఇంటర్ విద్యార్దులు ఇబ్బందులు పడుతున్నారని ఆపాఠశాల హెచ్ఎం. కరుణాకర్‌రెడ్డి సభా వేధికపై వివరించారు. దీంతో స్పందించిన శాసన సభ్యులు సునిల్ కుమార్ అక్కడే వేధికపై తాను ల్యాబ్‌ను ఆధునికరించేందుకు రూ 2.50 లక్షల నిధులను ఇస్తానాన్ని హామీ ఇచ్చారు. ఆ ఆ హామీ మేరకు సోమవారం స్దానిక జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కోట మండల తెదేపా నాయకులు కోట మండల తెదేపా అధ్యక్షులు పలగాటి భాస్కర్‌రెడ్డి, జలీల్ ఆహ్మద్, ఎం.సర్వోత్తమ్‌రెడ్డిలు ఎమ్మెల్యే సునిల్ కుమార్ అందచేసిన చెక్కును ఆపాఠశాల హెచ్ఎం. కరుణాకర్‌రెడ్డి కి అందచేశారు. ఈ సందర్బంగా జలీల్ ఆహ్మద్ మాట్లాడుతూ శాసనసభ్యులు పాశిం సునిల్ కుమార్ హామీ ఇస్తే నేర వేర్చుతారని, మాటకు కట్టుబడి నాయకుడుని పేర్కొన్నారు. అనంతరం హెచ్ఎం. కరునారెడ్డి మాట్లాడుతూ ఈ నిధులను ఓ కమిటి ద్వార పాఠశాలలో మౌలిక వసతులకు ఖర్చ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు మోహన్‌రెడ్డి, కొకర్ల మధుయాదవ్, చెంగలరావు, కోణిశెట్టి రమేష్, నౌషాద్, షంషద్దీన్, డి.సురేష్, చల్లా సురేష్, తిరుమలశెట్టి కోటీశ్వరరావు, చిన్నయ్య, సుహాసిని, సిద్దప్పరెడ్డి పోలమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.



## ఆటో బాధితుడు పవన్‌కు లక్ష రూపాయాలు సహాయం

**కోట, జులై 13 ప్రభాతవార్త** కోట మండలం చంద్రశేఖపురం గ్రామం వద్ద గత వారం క్రితం గాయాత్రి కంపెనీకి చెందిన బస్సు ఆటోను ఢీకొంది. ఈ ఆటో నుజ్జ నుజ్జ అయింది. ఆటో డ్రైవర్ పవన్ కుమార్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఆమేరకు స్దానిక తెదేపా నాయకులు గూడూరు శాసన సభ్యులు డాక్టర్, పాశిం సునిల్ కుమార్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకేళ్లారు. దీంతో శాసన సభ్యులు సునిల్ కుమార్ కంపెనీ ప్రతి నిధులతో మాట్లాడి ఆటో డ్రైవర్ పవన్‌కుమార్‌కు రూ 1లక్ష రూపాయాల చెక్కును పరిహారం కింది తీసి ఇచ్చారు. ఈ చెక్కును సోమవారం కోటలో ఆటో బాధితుడు పవన్ కుమార్‌కు తెదేపా అధ్యక్షులు పలగాటి భాస్కర్‌రెడ్డి, తెదేపా జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షులు షెక్. జలీల్ ఆహ్మద్, ఎం.సర్వోత్తమ్‌రెడ్డిలు అందచేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు మోహన్‌రెడ్డి, కోకర్ల మధుయాదవ్, తిరుమలశెట్టి కోటీశ్వరరావు, కోణిశెట్టి రమేష్, వెంకటకృష్ణారెడ్డి చిన్నయ్య, నౌషాద్, షంషద్దీన్, సురేష్, చల్లా సురేష్, రామయ్య, సుహాసిని, పోలమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## సజ్జలను సన్మానించిన శివుని

**కోవూరు, జూలై 13 ప్రభాతవార్త :** నెల్లూరులోని డీఆర్ ఉత్తమ్‌లో సోమవారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణిగోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రాయలసీమ ఎత్తిపోతల పథకం టాస్క్‌ఫోర్స్ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశానికి వచ్చిన వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డిని వైసీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి మర్యాదపూర్వకంగ కలిసి పుష్పగుచ్చం అందజేశారు.



## వీపీఆర్ ఫౌండేషన్ సేవలు నిరుపమానం

**కోవూరు, జూలై 13 ప్రభాతవార్త :** సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన వీపీఆర్ నేత్ర కార్యక్రమం పేద ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగకరమని టీడీపీ సీనియర్ నాయకులు బెల్లంకొండ విజయ్‌కుమార్, సాయిరెడ్డిలు తెలిపారు. కోవూరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహ ప్రాంగణంలో సోమవారం వీపీఆర్ నేత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వీపీఆర్ నేత్ర కార్యక్రమంలో పాల్గొన్న వారికి కంటి పరీక్షలు నిర్వహించడమే కాకుండా ఉచితంగా అద్దాలు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టిన వీపీఆర్ దంపతులకు కోవూరు ప్రజానీకం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ శిబిరానికి ఇంత పెద్ద ఎత్తున ప్రజలు హాజరు కావడం, వారికి వీపీఆర్ నేత్ర ఉద్యోగులు విసుగు లేకుండా కంటి పరీక్షలు నిర్వహించి వారికి అద్దాలు పంపిణీ చేయడం, వారికి కూడా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అనంతరం ఉచితంగా అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు చెన్నకేశవ రెడ్డి, కొండయ్య, తదితరులు ఉన్నారు.





## కోవూరులో సమాచార శాఖ కమిషనర్ పర్యటన

**కోవూరు జూలై 13 ప్రభాతవార్త :** సమాచార హ క్కు చట్టాన్ని అన్య ప్రభుత్వ కార్యాలయాల్లో సమర్థ వంతంగా అమలు చేయాలన సమాచార శాఖ కమిషనర్ రవిబాబు తెలిపారు కోవూరు తాలూకా కార్యాల ప్రాంగణంలోని తహసీల్దార్ ఎం పీడీవో కార్యాలయాలను సోమవారం అయినా ఆకస్మికంగా పరిశీలన చేపట్టారు ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలోనూ తహ సీల్దార్ కా ర్యాలయంలోనూ సమాచార హక్కు సంబంధించి న రిజిస్టర్లను పక్కాగా నమోదు చేయడం పట్ల ఎంపీడీవో శ్రీహరి రెడ్డిని డిప్యూటీ తహసీల్దార్ బషీర్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి కార్యాలయంలోనూ దీనికి సంబంధించి ప్రత్యేకంగా రిజిస్టర్లు ఏర్పాటు చేయడం పట్ల ఇరువురిని ఆయన అభినందించారు దరఖాస్తుదారులకు నిర్ణీత సమయంలోనే సమాచారాన్ని అందించాలి. ఈ సందర్భంగా ఆయన వారికి సూచించారు



## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖరుల ఆందోళన

**వింజమూరు, జూలై 13, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 396 పై వింజమూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు, డి.టి.పి ఆపరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖరులు మాట్లాడుతూ ప్రభుత్వం తెచ్చిన జీవో 396 వల్ల తమ జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందిని, మేము అనాదిగా ఈ వృత్తిని నమ్ముకుని బతుకుతున్నామన్నారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటు పరం చేయాలని జీవో 396 జారీ చేసింది. దీనివల్ల మా పై ఆధారపడ్డ చిరు ఉద్యోగులు, కుటుంబ సభ్యులు తీవ్రంగా నష్టపోతారు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన రుసుములకు కట్టుబడి పనిచేస్తామని, ప్రజల నుండి అదనపు మొత్తాలు తీసుకోబోమని కూడా వారు హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంఘం, నెల్లూరు జిల్లా దస్తావేజు లేఖరుల సంఘం పిలుపు మేరకు జూలై 20 నుండి జూలై 31 వరకు పెన్ డౌన్ కార్యక్రమం చేపట్టనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం జీవో నెంబర్ 396 నువెంటనే ఉపసంహరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు స్టాంపు వెండర్లు డిటిపి ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



## సాంకేతికత రంగాలలో విద్యార్థులు రాణించాలి

**వింజమూరు, జూలై 13, ప్రభాతవార్త:** నేటి తరం విద్యార్థులు సాంకేతికత రంగాలలో రాణించాలని ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుండి నెల్లూరులో డాక్టర్ విజయ్‌కుమార్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు వెళ్లే విద్యార్థుల బృందాన్ని జెండా ఊపి సాగనంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ర్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పరిశోధన ఆసక్తిని పెంపొందించేందుకు డాక్టర్ విజయ్‌కుమార్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సైన్స్ ఫెయిర్ నిర్వహించడం అభినందనీయమన్నారు. సైన్స్ ఫెయిర్‌కి వెళ్లే విద్యార్థులు వ్యవసాయం పర్యావరణ పరిరక్షణ పునరుత్పాదక ఇంధన వనరులు ఆరోగ్యం సాంకేతికత వంటిఅంశాలపై తయారుచేసిన అద్భుతంగా ఉన్నాయని విద్యార్థులు దశలోనే శాస్త్రీయ పరిష్కారాలు చూపడం అభినందనీ యమన్నారు ప్రభుత్వం విద్య సైన్స్ రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని విద్యార్థులు ప్రతి అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గూడా నర్సా రెడ్డి మండల అధ్యక్షురాలు వనిపెంట హైమావతి, సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ సొసైటీ డైరెక్టర్ కోడూరు నాగిరెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, నియోజకవర్గ బిజెపి నాయ కులు కదిరి రంగా రావు, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ చేబ్రోలువసంతరావు, దుద్దిగుంట శ్రీనివాసరెడ్డి, గువ్వల హర్షవర్ధన్ రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయులు వీర రాఘవులు, ఉపాధ్యాయలు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం : మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్

**కావలి, జూలై 13 ప్రభాతవార్త :** దేశంలో పిఎం నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రబుత్వం ఏపిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృ త్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. స్థానిక జర్నలిస్టుక్లబ్‌లో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు, ప్రాంతీయ రాజకీయాలపై ఆయన పలు వ్యాఖ్యలు చేశారు. గత 12ఏళ్ళుగా పిఎం పరిపాలనలో ప్రజలకు చేకూరిన లబ్ది ఏమి లేదని విమర్శించారు. ఆయన రామాలయ నిర్మాణం కోసం దేశ వ్యాప్తంగా ప్రతి ఇల్లు, గ్రామం కోటీశ్వరుల నుంచి వేల కోట్ల రుపాయల చందాలు వసూలు చేశారన్నారు. అయితే ఆ నిధుల్లో 75శాతం మేర అవినీతి జరిగిందని యూపి ప్రజలే చెప్పుకోవడం జరుగుతోందని ఆరోపించారు. దీనిపై సిబిఐ విచారణకు ఆదేశించిన దీనిపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఈ నిధులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిబిఐ విచారణ జరిపించాలని కాంగ్రెస్‌పార్టీ తరపున ఆయన డిమాడ్ చేశారు. రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా పనిచేసిన సిఎం చంద్రబాబునాయుడు పరిపాలనపై ప్రజలు తీవ్ర వరక్తితో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 23జిల్లాల్లో నేను పర్యటించాను ఎక్కడ కాని అభివృద్ధి కనిపించలేదని పేర్కొన్నారు. వైకాపా హయాంలో ఆయనపై 11 కేసులు పెట్టారని, గతంలో తమిళనాడులో జయలలిత విషయంలో ఇలాగే జరిగిందని గుర్తు చేశారు. 2029 ఎన్నికల్లో కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన జోష్యం చెప్పారు. రాష్ట్రంలో ఎస్‌సి విద్యార్థుల పరిస్థితి ప్రస్తుతం అత్యంత దయనీయంగా ఉందన్నారు. దళిత క్రైస్తవులు, దళితులు కాంగ్రెస్‌పార్టీని వీడటం లేదని సమాజంలో ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తొందని వారి హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు.



## రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**కావలి, జులై 13 ప్రభాతవార్త :** రాయల సీమ ఎతి పోతల పథకంపై వైకాపా రౌం డ్‌టేబుల్ సమావేశం నెల్లూరులోని డిఆర్ ఉత్తమ్ హోటల్‌లో వైకాపా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో రాయలసీమల ఎతి పోతల లిఫ్ట్ ఇరిగేషన్‌పై సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశంలో రాయల సీమ ఉమ్మడి ప్రకాశం నెల్లూరు జిల్లా ముఖ్య నేతలతో కలిసి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపాల్గొని ఈ ప్రాంత నీటి ప్రాజెక్టుల ప్రాధాన్యత, భవిష్యత్తు కార్యాచరణపై నాయకులతో సుదీర్ఘంగా చర్చించారు.



## అవస్థలు పడుతున్న ఇండియన్‌గ్యాస్ వినియోగదారులు

**కావలి, జులై 13 ప్రభాతవార్త :** ఇండియన్ గ్యాస్ వినియోగదారులు పడుతున్న అవస్థలపై సోమవారం ప్రపంచ మానవహక్కుల సంఘం రీజనల్ ఛైర్మెన్ మొహమ్మద్ అబ్దుల్ అలీం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో హైమ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఇండియన్ గ్యాస్ సిలిండర్లను సరఫరా చేశారని ఆ ఏజెన్సీ మూసివేసిన తరువాత పట్టణంలోని ఇండియన్ గ్యాస్ వినియోగదారులకు జలదంకి గ్రామం నుంచి గ్యాస్ సిలిండర్లను సరఫరా చేసేవారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన నిబంధనల ప్రకారం 24రోజులకు ఒక సిలిండర్, గ్రామీణ ప్రాంతవాసులకు 45 రోజులకు ఒకసారి గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో అవ్యవసరం కింద గ్యాస్ సలిండర్‌ను రూ.2వేలకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ప్రజా అవసరాల దృష్ట్యా అధికారులు స్పందించి మున్సిపల్ పరిధిలో ఉన్న ఇండియన్ గ్యాస్ ఏజెన్సీని పట్టణంలోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీకి బదిలీ చేయాలని ఆర్డీఓను కోరారు.



## పూర్వ విద్యార్థుల 40వ వార్షిక స్నేహ సమ్మేళనం



**కావలి, జులై 13 ప్రభాతవార్త :** కావలి జడ్పి బాలుర హైస్కూల్‌లో 1985సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన సహచరులు సుమారు 45మంది కావలి సమీపంలోని రామాయపట్నం సముద్రతీరంలో సోమవారం నిర్వహించిన 40వ వార్షిక స్నేహ సమ్మేళానాన్ని ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బెంగులూరు, హైదరాబాద్, కాకినాడ వంటి నగరల్లో కాకుండా వివిద పట్టణాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు నిర్వహించుకొంటున్న మిత్రులు తమ వ్యక్తిగత, వృతిపరమైన పనులను పక్కనపెట్టి చిన్ననాటి మిత్రులను కలసుకోవడానికి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం చిన్ననాటి మదుర క్షణాలను నెమరువేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయతగా పలకరించుకొన్నారు. పాఠశాల రోజుల్లో జరిగిన మరపురాని సంఘటనలను గుర్తు చేసుకున్నారు. స్నేహబందాన్ని తాము చేస్తున్న ఉద్యోగం, వ్యాపారం, కుటుంబ సంబంధం కలుపుకొని మరింత దగ్గరయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకోవడం, పరిచయాలను పెంచుకోవడం ఈ సమ్మేళానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఆత్మీయులు, స్నేహితులు అందరూ తిరుగు ప్రయాణం చేశారు. కావలి లైన్‌ప్రెండ్స్ సభ్యులందరూ భవిష్యత్తులో ఇలాంటి స్నేహసమ్మేళనాలు నిర్వహించాలని కొనియాడారు. సమాజానికి సేవ చేసే ల్యోంతో రక్తదాన శిబిరాలు నిర్వహణ, ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించడం ప్రతి ఏడాది టెన్త్‌లో అత్యదిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు చేపడుతుండడం సంతోషకరమన్నారు. స్నేహానికి వయసుతో పనిలేదని కాలం ఎంతమారినా చిన్ననాటి అనుబంధాలు ఎప్పటికి చెరిగిపోవని చాటి చెప్పారు.

## బుచ్చిరెడ్డిపాళెం సిఐగా శివరామకృష్ణారెడ్డి

**బుచ్చి జులై 13 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం సిఐగా సోమవారం శివరామకృష్ణారెడ్డి బాద్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్పి ఆదేశానుసారం బుచ్చిరెడ్డిపాళెం స్టేషన్‌కి సిఐగా వచ్చినట్లు ఆయన పేర్కున్నారు. బుచ్చి పోలీస్‌స్టేషన్ పరిధిలో చట్ట వ్యతిరేఖ కార్యక్రమాలు జరుగుతుంటే తన దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. ప్రజల సహకారంతో శాంతి భద్రతలు కాపాడుతామని అన్నారు. బుచ్చి లో ట్రాపిక్ పైన ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు చెప్పారు. త్రిబుల్‌రైడింగ్, గంజాయి వంటి మత్తు పదార్ధాలపైన ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకోసం నిరంతరం కృషి చేస్తామన్నారు.



## వైసిపి ప్రభుత్వంలో జరిగిన రీసర్వే సమస్యలవల్లే రెవెన్యూ సమస్యలు;ఎమ్మెల్యే కాకర్ల

**కలిగిరి, జూలై13, ప్రభాతవార్త;** గతంలో పని చేసిన కొందరు అధికారులు, వైసిపి ప్రభుత్వం చేపట్టిన రీసర్వే వల్ల నియోజక వర్గంలో రెవిన్యూ సమస్యలు తలెత్తాయని ఉదయగిరి స్థానిక శాసన సభ్యులు కాకర్ల సురేష్ తెలిపారు. సోమవారం "గ్రీవె న్స్‌డే" పురస్కరించుకొని ఎమ్మెల్యే కలిగిరి తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్ డేలో పాల్గొన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రెవిన్యూ సమస్యలను అర్జీలను ఎమ్మెల్యేకు ప్రజలు అందజేశారు. మండలంలో అపరిష్రుతంగా ఉన్న సమ సంయలపై ప్రజలు ఎమ్మెల్యేకు వివరిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తమ సమ స్యలపై ఎన్నోసార్లు మండల కార్యాల యాలకుతిరుగుతున్నారని అధికారులు వచ్చిన పిర్యాదులను సహృదయంతో పరిష్కరించాలన్నారు. ప్రజలను పదేపద్దే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. ఏస్థాయిలో సమస్యలు పరిష్కారమౌతాయో ఆస్థాయిలో వాటిని పరిష్కరించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకు రావాలన్నారు. ఇందులో పార్టీలతో సంబందంలేదన్నారు. ముఖ్యంగా పేదల సమస్యలు పార్టీలతో పనిలేకుండా అధికారులు త్వరిత గతిన పరిష్కరించాలన్నారు. ఇందులో ఏఅదికారికీ మినహాయింపు లేదన్నారు. తాను చూసిన వాటిలో దీర్గ కాలిక సమస్యలు ఎన్నో ఉన్నాయన్నారు. వీటిలో అదికారుల తప్పిదాల వల్ల కొన్ని ఉంటే గత వైసిపి ప్రభుత్వం చేపట్టిన రీసర్వే వల్ల అనేక తప్పిదాలు జరిగినట్లు తన దృష్టికి వస్తున్నా యన్నారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు, రెవిన్యూ మినిస్టర్ ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు చేయాలని పదేపదే చెబుతున్నారని తానుకూడా గత రెండు సంవత్సరాలనుండి సమస్యలు తీర్చేందుకే ప్రయత్నిస్తున్నానన్నారు. కొన్ని సమస్యలు తీర్చగలిగామని మరికొన్ని చేయాల్సి ఉందన్నారు. ప్రజలు కూడా అర్జీలు ఇచ్చిన వెంటనే పనులు జరగలేదని బాదపడవద్దన్నారు. అదికారులు చెప్పిన ప్రకారం అధికారులకు కొంత సమయం ఇచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. రాబోయే 3సంవత్సరాల్లో రెవిన్యూ సమ స్యలు తీరుస్తామన్నారు. అధికారులు కూడా కుంటుబాల్లో రెవిన్యూ సమస్యలు సృష్టించి గొడవలు పెట్టవ ద్దన్నారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులుపూసాల వెంగపనాయుడు, పార్టీ జిల్లా ఉపాద్యక్షులు బిజ్జం క్రిష్ణారెడ్డి, జిల్లా పార్టీ నాయకులు చీమల తాతయ్య, మండల కార్యదర్శి కొప్పోలుఏడుకొండ లు, మండల నాయకులు సిహెచ్ సుబ్బారెడ్డి, ఎర్రగుంట్ల రమణారెడ్డి, మహేష్, మండల తాసిల్దారు మొలతాటి గిరీష్ ,సిఐ సుబ్బా రావు, తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి పనుల్లో ఇబ్బందులు సృష్టించే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోండి : కాకర్ల

**కలిగిరి, జూలై13, ప్రభాతవార్త;** కొతమంది ఉపాది హామీ పీల్డ్ అసిసెంట్లు సక్రమంగా పనుచేయించడం లేదని తమ దృష్టికి వచ్చిందని అలాంటి వారిపై అదికారులు చర్యలు తీసుకోవాలని ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ తెలిపారు. సోమవారం గ్రీవెన్స్‌డే సందర్బంగా మండల కలిగిరి మండల అదికారుల కార్యాలయాల్లో యంఎల్ఏ సమావేశమయ్యారు. కలిగిరి యంపిడిఓ ప్రత్యూషతో ప్రత్యేక సమావేశమైన కాకర్ల మండలంలో జరుగుతున్న ఉపాది హామీ పనులపైవివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్బంగా పేద లకు వరంగా మారిన ఉపాధి హామీ పనులు ప్రజలకు సక్రమంగా ఉపయోగ పడేవిదంగా చేయించాలన్నారు. ప్రజలకు ఇబ్బంది వచ్చే విదంగా చేరాదన్నారు. ఈసందర్బంగా కలిగిరి మండలంలో వెలగపాడు, క్రిష్ణారెడ్డి పాళెం, నాగసముద్రం, తూర్పు గడ్డదొన, తూర్పు దూబగుంట తదితర పంచాయితీలనుండి పీల్డ్ అసి స్టెంట్లపై తమ కార్యాలయానికి పిర్యాదులు వచ్చాయని వీటిపై ఏమిచర్యలు తీసుకున్నారన్నారు. అదేవిదంగా నియోజక వర్గంలోఉదయగిరి, శీతారాంపురం తదితర మండలాల్లోకూడా కొందరిపై పిర్యాదులు ఉన్నాయన్నారు. వీరందరూ సక్రమంగా పనులు చేయించడంలేదని, ప్రజలకు ఉపయోగ పడడంలేదని తమకు పిర్యాదులు వస్తున్నాయని వీని పిలిపించి మాట్లాడాలని మారకపోతే వీరిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏది ఏమైనా ప్రజలకు ఉపయోగపడేవిదంగా అదికారులు పనిచేయాలన్నారు.



## బిపిసిఎల్, సంగమిత్ర స్కూల్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్వాడా ర్యాలీ

**నెల్లూరు, జులై 13, ప్రభాతవార్త – విద్య** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ నెల్లూరు విభాగం, స్థానిక సంగమిత్ర పాఠశాల విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నగరంలో ఘనంగా అవగాహన ర్యాలీ నిర్వ హించారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రహిత సమాజంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ధ్యేయంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ ర్యాలీలో సంగమిత్ర స్కూల్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని పరిశుభ్రతపై స్లోగన్లు ఇస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో బిపిసిఎల్ టెరిటరీ మేనేజర్ ఎస్. వేణుగోపాల్, నెల్లూరు సేల్స్ ఆఫీసర్ డి. సంతోష్ కుమార్, ఇంజనీరింగ్ ఆఫీసర్ పి. గణేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు ఎం.వి.ఆర్ ఇండస్ట్రీస్ అధినేత ఎం.వెంకటేశ్వర్లు, శ్రీకాంత్ ఇడిగినేని, నారాయణ, దిలీప్ షేక్ పాల్గొన్నారు.



## వసతులు కల్పిస్తే ఖాళి చేయిస్తాం

**బుచ్చి జులై 13 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీ పరిధిలోని పాత గుడిపల్లి కాలువపై నివాసం ఉంటున్న పేదలను వారి అందరికి నివాస యోగ్యమైన గృహాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించిన తరువాతే వారిని ఆ ప్రాంతాల నుండి ఖాళీ చేయిస్తామని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, కమీషనర్ చిన్నబాబు తెలిపారు. వారం రోజులుగా తాము నివాసం ఉంటున్న ప్రాంతంలో కొత్త వ్యక్తులు వచ్చి కొలతలు వేస్తు ఇక్కడ సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నామని మీరందరు ఇల్లు ఖాళీ చేయాలని చెబుతున్నారని దీంతో భయభ్రాంతులై సిపిఎం పార్టీ కార్యాలయానికి వెళ్ళి తెలిపారు. దీంతో సిపిఎం పార్టీనాయకులు ముత్యాల గురునాథం, చల్లకొలుసు మల్లికార్జున, ఆంధోలన తెలియపరచారు. ఈ సందర్బంగా సిపిఎం నాయకులు మాట్లాడుతు 15 అడుగుల లోబడి సిమెంటోరోడ్డు నిర్మాణం నిర్మించుకుంటే వీరి గృహాలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని అధికారులు పరిశీలించాలన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు పోతంశెట్టి శ్రీనివాసులు, షేక్ జానీబాషా, దత్త శ్రీకోటయ్య, కొమ్మ శ్రీనివాసులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## గోల్డ్ మెడల్ సాధించిన సంగం బిసి బాలికల హాస్టల్ బాలికలు

**సంగం జులై 13 ప్రభాతవార్త** సంగం బిసి బాలికల హాస్టల్ విద్యార్దులు బి అర్చన (10వ తరగతి ), కె అపర్ణ (9వ తరగతి ) విద్యార్దినులు షూటింగ్ బాల్‌లో జిల్లాలో విజేతలుగా నిలిచి స్టేట్‌కి సెలక్ట్ అయినట్లు సంక్షేమాధికారిణి ఎం.మల్లేశ్వరీ తెలిపారు. శనివారం, ఆదివారం కడపజిల్లా పులివెందలలో రాష్ట్రస్దాయిలో ఆడిసెకండ్ ప్లేస్ గోల్డ్‌మెడల్ సాధించినట్లు ఆమె తెలిపా రు. ఈ సందర్బంగా ఆమెవిద్యార్దినులను అభినందించారు. ఈవిషయాన్ని జిల్లా డి.బి.సి వెంకటలక్ష్మీ దృష్టికి తీసుకొని వెళ్ళగా ఆమె కూడా విద్యార్దినులను అభినందించినట్లు ఆమె పేర్కున్నారు.



# తిరుపతి డివిజన్

## దలువాయి చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు.. చర్యలు తీసుకోవాలంటూ సీపీఎం డిమాండ్

తిరుపతి రూరల్, జూలై 13 ప్రభాతవార్త:

తిరుపతి రూరల్ మండలం దలువాయి చెరువులో ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తవ్వి ఇటుక బట్టీలకు తరలిస్తున్న యాజమాన్యాలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కమ్యూనిస్టు పార్టీ తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారికు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్. జయచంద్ర, జి. చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దలువాయి చెరువు గ్రామ ప్రజలకు, రైతులకు అత్యంత ముఖ్యమైన నీటి వనరని పేర్కొన్నారు. ఇటువంటి చెరువులో మట్టిని యథేచ్ఛగా తవ్వి తరలించడం వల్ల చెరువు సహజ స్వరూపం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. మరింతగా, ఈ అక్రమ తవ్వకాల వల్ల భవిష్యత్తులో చెరువు నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటుక బట్టీల యాజమాన్యాలు ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో రెవెన్యూ, గనులు, పోలీసు శాఖలు సంయుక్తంగా విచారణ చేపట్టి అక్రమ మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే ఈ పనులను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు, చెరువులు వంటి సహజ వనరులను కాపాడటం అధికారుల బాధ్యత అని గుర్తుచేశారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున



ఆందోళనలు చేపడతామని సీపీఎం నాయకులు హెచ్చరించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో బూత్‌ల పర్సంటేజిని పరిశీలించిన ధ్వజారెడ్డి



రైల్వేకోడూరు రూరల్, జులై 13(ప్రభాతవార్త)::

రైల్వేకోడూరు మండలంలో చివరిగా జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో బూతులు వారిగా పర్సంటేజీ వివరాలను రైల్వేకోడూరు ఎన్నికల అధికారులు శోభన్ బాబు మరియు తాసిల్దార్ అమర్నాథ్ ను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు తమ ఓటు డిజిటలైజేషన్ చేసుకోవడానికి చివరిగా జరుగుతున్న ప్రక్రియ అని ఓటర్లు తప్పక ఓటు నమోదు విషయంలో నిరక్ష ్యం చేయకుండా ప్రతి ఒక్క ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. అదేవిధంగా మండలంలోని అన్ని బూతులు సంబంధించిన ఎన్రోల్మెంట్ వివరాలు మరియు డబల్ ఎంట్రీలు, మై గ్రేట్ వివరాలు మరియు చనిపోయిన ఓటర్ల వివరాలను ఆరా తీసి ఓటర్లు మాత్రమే తమ ఓటును డిజిటలైజేషన్ చేసుకోవడానికి కేవలం ఒక రోజు లోపల చేసుకోవాలని అన్నారు. ఓటు హక్కు తప్పక ఓటర్లు నమోదు చేసుకొని ఓటు హక్కును పొందాలని తెలిపారు ఈ కార్యక్రమంలో కోడూరు ఉప సర్పంచ్ తోట శివ సాయి, ఆర్ వి రమణ, మహేశ్వర్ రెడ్డి, శంకరయ్య, ప్రసాద్, బత్తాల సుబ్రహ్మణ్యం, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ పునఃనిర్మాణ వేడుకల్లో ముక్కా వరలక్షుమ్మ

### 100116 ఆలయ అభివృద్ధి కి వితరణ



పెనగలూరు, జూలై 13 ప్రభాతవార్త:

రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం తిరుణంపల్లి గ్రామంలో వనేశ్వర స్వామి ఆలయ పునః నిర్మాణ వేడుకల్లో రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు ముక్కా వరలక్షుమ్మ ఆదివారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కూటమి నాయకులు ముక్కా వరలక్షుమ్మ ను గజ మాలతో ఘన స్వాగతం ఫలికారు. ఆలయం లో ముక్కా వర లక్షుమ్మ ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ అభివృద్ధి కి రూ.100116/ విరాళంగా ఇచ్చారు. వేద పండితులు ముక్కా వరలక్షుమ్మను ప్రత్యేక మంత్రోచ్చరణలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం లో మాజీ మండల టీడీపీ అధ్యక్షులు కొత్త బాలకృష్ణ, దాసరి దామోదర్ నాయుడు, సురేష్ రెడ్డి, కె నాగేశ్వరావు, బత్తిన వేణు గోపాల్ రెడ్డి, బి. చంద్రశేఖర్, సుబ్బారాయుడు నాయుడు, ఇంద్రా రెడ్డి, ఎం. ప్రసాద్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియ నాణ్యతతో జరిగింది

### తహసీల్దార్ ఏకె ప్రేమ్ కుమార్



పెనగలూరు(జూలై 13)ప్రభాతవార్త

తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం లో

ఎస్ ఐ ఆర్ ప్రక్రియ అందరి సహకారంతో పూర్తి నాణ్యత తో జరిగిందని తహసీల్దార్ ఏకె ప్రేమ్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన రాజకీయ పార్టీలతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జరిగిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ను రాజకీయ పార్టీలకు వివరించారు. చనిపోయిన ఓట్లు, రెండు చోట్ల ఉండే ఓట్లు, చాలా కాలంగ ఊర్లో లేని ఓట్లు పై చర్చించారు. చనిపోయిన ఓట్లు, తొలగించిన ఓట్లు పై నోటీసులు ఇస్తామని పేర్కొన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రోగ్రాం నేటితో పూర్తి అవుతుందని ప్రజలు వారి వద్ద ఎస్ ఐ ఆర్ ఫార్మ్స్ వెంటనే బి ఎల్ వో లకు ఇవ్వాలని సూచించారు. ఇకపై కొత్త ఓట్లుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో డిటి సుమని, మండల సర్వేయర్ వాసు దేవరెడ్డి, ఆర్ ఐ రామ్మోహన్ నాయుడు, మండల వైసీపీ బాధ్యడు కేతా చక్రపాణి, మండల జనసేన బాధ్యుడు గొబ్బూరి హరి పాల్గొన్నారు.

## నారాయణవనంలో మండుతున్న ఎండలు

### 42 డిగ్రీలు నమోదు



నారాయణవనం, జూలై 13 ప్రభాతవార్త : నారాయణవనం మండలంలో సోమవారం 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయ్యింది, గత కొద్ది రోజులుగా ఎండలు మండుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందలను ఎదుర్కొంటున్నారు. మండుతున్న ఎండలతో ప్రజలు ఉపసమనం పొందడానికి ప్రముఖ పుణ్యక్షేత్రం, ఆధ్యాత్మిక కేంద్రంగా బాసిల్లుతున్న కైలాసనాథకోనలో ఇటు భక్తులు అటు పర్యాటకుల సందడితో కిటకిటలాడింది. వేసవి తాపం తీర్చుకోవడం కోసం పర్యాటకులు అధికసంఖ్యలో తరలివచ్చి జలపాతంలో స్నానం చేశారు. జలపాతంలో స్నానం చేసి మండుతున్న ఎండ నుంచి ఉపసమనం పొందుతున్నారు. స్థానికులతో పాటు తమిళనాడు రాష్ట్రం వందల సంఖ్యలో పర్యటకులు తరలివస్తున్నారు.

## ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

### కోడూరు రూరల్ సర్కిల్ సీఐ డి. శ్రీనివాసులు



రైల్వే కోడూరు అర్బన్, జులై 13,ప్రభాత వార్త.

పుల్లంపేటలోని కోడూరు రూరల్ సర్కిల్ కార్యాలయంలో కోడూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ డి. శ్రీనివాసులు సర్కిల్ పరిధిలోని పుల్లంపేట, చిట్వేలు, ఓబులవారిపల్లి, పెనగలూరు మండలాలకు చెందిన ట్రాక్టర్ యజమానులు, జేసీబీ యజమానులు, డ్రైవర్లతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ డి. శ్రీనివాసులు మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుక, గ్రావెల్, మట్టి ని తవ్వడం, తరలించడం, నిల్వ చేయడం లేదా విక్రయించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. అక్రమంగా ఇసుక, గ్రావెల్ లేదా మట్టిని తరలిస్తూ పట్టుబడిన వారి మీద చట్టపరమైన కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేసి సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎవరైనా చెరువులు, కుంటలు లేదా ఇతర ప్రభుత్వ భూముల నుంచి మట్టిని తీసుకెళ్లాలనుకుంటే తప్పనిసరిగా సంబంధిత ఇరిగేషన్ శాఖ లేదా సంబంధిత ప్రభుత్వ శాఖల నుండి ముందస్తు అనుమతి పొందాలని సూచించారు. అలాగే ఇసుక, గ్రావెల్ లేదా మట్టి రవాణా చేపట్టే వారు మైన్స్ అండ్ జియాలజీ శాఖ లేదా సంబంధిత శాఖల ద్వారా జారీ చేసిన చెల్లుబాటు అయ్యే అనుమతులు, రవాణా పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు.అనుమతులు లేకుండా వాహనాలను వినియోగించడం వల్ల యజమానులు, డ్రైవర్లు అనవసరంగా చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమానులు తమ వాహనాలను అక్రమ రవాణాకు అద్దెకు ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని, డ్రైవర్లు కూడా సంబంధిత పత్రాలు పరిశీలించిన తర్వాత మాత్రమే రవాణా చేపట్టాలని సూచించారు.ప్రజల సహకారంతో అక్రమ మైనింగ్ మరియు అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. సర్కిల్ పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిరంతరం నిర్వహించబడతాయని, రాత్రి మరియు పగలు వేళల్లో కూడా వాహనాల తనిఖీలు కొనసాగుతాయని చెప్పారు.అక్రమ ఇసుక, గ్రావెల్ లేదా మట్టి తవ్వకం, రవాణా గురించి సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా కోడూరు రూరల్ సర్కిల్ పోలీసులకు తెలియజేసి ప్రజలు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది, ట్రాక్టర్ యజమానులు, జేసీబీ యజమానులు, డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వందన మల్లేశ్వరస్వామికి మహర్ధశ

### ప్రతి సోమవారం విశేషపూజలు

### పలమనేరు నుండి ఉచిత ఆటో సౌకర్యం



పలమనేరు, జూలై 13, ప్రభాతవార్త:

సలమనేరు రూరల్ మండలం జగమర్ల సంచాయితీ దేవళంపెంట అటవీ ప్రాంతంలో వెలసిన వందన మల్లేశ్వరస్వామి గుడికి మహర్ధశ లభించింది. పురాతన కాలంలో నిర్మించిన ఈ గుడి ఆలనాపాలనా లేక శిథిలావస్థలో వుండేది. చుట్టూ పొదలు, చెట్లు పెరిగిపోయి అడుగుపెట్టడానికి కూడా వీలులేని విధంగా వుండేది. దేవళం పెంట నుండి సుమారు రెండు కిలో మీటర్ల దూరం గుడి వద్దకు వెళ్ళడానికి దారి కూడా లేదు. దీంతో కొందరు గ్రామ పెద్దలు గ్రామస్తులను చైతన్య వంతులను చేసి శ్రమదానంతో కాలినడక దారి ఏర్పాటు చేశారు. ఎనిమిదేళ్ళ క్రితం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి నిధులు అందజేయడంతో దారి సమస్యతో పాటు గుడి పునర్మిర్మాన పనులు పూర్తి చేశారు. దీంతో గుడి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆటోలు కార్లు కూడా గుడివద్దకు వెళుతుండడంతో దీంతో ప్రతి ఏటా జనవరి 1న, మహాశివరాత్రి సందర్భంగానూ గుడికి భక్తుల రాకపోకలు అన్నదానాలు జాగరణలు చేస్తున్నారు. కొందరు భక్తులు ప్రతి సోమవారం గుడికివెళ్ళి అభిషేకాలు విశేషపూజలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గంటావూరు గంగమ్మగుడి చైర్మన్ సేవారత్న గా.మురుగన్ ఈ గుడికి తన వంతు సేవలు చేస్తున్నారు. ఇక నుండ ప్రతి సోమవారం గుడి వద్ద అన్నదానం పలమనేరు నుండి ఉచిత ఆటో సౌకర్యం ఏర్పాటు చేశారు. దీంతో గుడికి ఇక మహర్ధశ ప్రాప్తించినట్లేనని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మహిళ అనుమానాస్పద మృతి

చంద్రగిరి, జూలై 13 ప్రభాతవార్త:

మండల పరిధిలోని మూలపల్లి అటవీ ప్రాంతంలో మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మూలపల్లి ఎస్టీ కాలనీకి చెందిన రాజేంద్ర, కుమారి దంపతులు పశువులను కాస్తూ అటవీ ప్రాంతంలోనే జీవిస్తున్నారు. అయితే రాజేంద్ర తన భార్య కుమారి (35) మృతి చెందినట్లు సమీప బంధువులకు తెలియజేయడంతో అనుమానాలు కలిగించాయి. దీంతో పోలీసులకు సమాచారం అందడంతో సోమవారం సంఘటనా స్థలికి చేరుకుని కుమారి అనుమానాస్పద రీతిలో మృతి చెందినట్లు గుర్తించి దర్యాప్తు చేపట్టారు.

## బుజ్జి రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు....



తిరుపతి రూరల్, జులై 13 ప్రభాతవార్త:

తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జి.పాలెం బుజ్జి రెడ్డి అలియాస్ బ్రహ్మానందరెడ్డి ఆకస్మిక మరణం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పార్టీ పట్ల ఆయన చూపిన విధేయత, నిబద్ధతను నాయకులు, కార్యకర్తలు గుర్తుచేసుకుంటూ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కీలక పాత్ర పోషిస్తూ, ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొనేవారు. ఈ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సహా పలువురు నాయకులు బుజ్జి రెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బుజ్జి రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని, ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారా నిజమైన నివాళి అర్పించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.

## గడ్డివామి దగ్ధం భారీగా ఆస్థి నష్టం

వరదయ్యపాలెం, జూలై 13, ప్రభాతవార్త

మండలం బత్తలవల్లం గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన రైతు మునీంద్రకు చెందిన గడ్డివామి ఆదివారం సాయంత్రం అగ్నికి ఆహుతైంది. ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. గడ్డివాము పూర్తిగా దగ్గనమైన పరిస్థితి. రైతు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక వాహనం సంఘటన స్థలంకు చేరుకుని మంటలను అదుపు చేశారు. గడ్డి వాము ఒక్కసారిగా అంతా బూడిద కావడంతో తీవ్రంగా నష్టపోయానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనా స్థలాన్ని గ్రామస్తులు పరిశీలించారు. ప్రభుత్వం తగిన సహాయం అందించాలని బాధితుడు ప్రభుత్వాన్ని కోరారు.

## 15 న మండల సర్వసభ్య సమావేశం.



చిట్వేలి, జూలై 13,ప్రభాతవార్త;

మండల ఎంపీపీ టంగుటూరి చంద్ర అధ్యక్షతన స్థానిక ఎంపీడీవో సభా భవనం నందు జూలై 15 బుధవారం ఉదయం 11:00 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలియపరిచారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, జడ్పిటిసి, పంచాయతీ ప్రత్యేక అధికారులు మరియు అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో గల సమగ్ర సమాచారంతో ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలని ఎంపీడీవో శ్రీనివాసులు కోరారు.

## ఈత కోసం వెళ్లి యువకుడు గల్లంతు

- గాలిస్తున్న పోలీసులు







వరదయ్యపాలెం, జూలై 13, ప్రభాతవార్త

మండలంలోని మరదవాడ వద్ద గల అగాధం లాంటి భారీ లోతు గల క్వారీ గుంతల్లో ఆదివారం సరదాగా ఈత కొట్టేందుకు తన స్నేహితులతో కలిసి వెళ్ళిన తిరుపతి జిల్లా బీఎన్ కండ్రిగ మండలం నెలవాయి పంచాయతీ వేణుగోపాలపురం గ్రామానికి చెందిన సుకుమార్ 30 అనే యువకుడు గల్లంతు అయ్యాడు. ఎంతసేపటికి అతను ఒడ్డుకు రాకపోవడంతో స్నేహితులు గుర్తించి సుకుమార్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి వేళ చీకటి కావడంతో సోమవారం ఉదయం నుంచి వరదయ్యపాలెం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.

### ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ..

వరదయ్యపాలెం మండలం మరదవాడ సమీపంలోని క్వారీలో ఈతకు వెళ్లిన సుకుమార్ గల్లంతయిన విషయం తెలుసుకున్న వెంటనే గౌరవ జిల్లా పాలనాధికారికి చర్వాణి ద్వారా సమాచారం ఇచ్చి అదేవిధంగా బీఎన్ కండ్రిగ, సత్యవేడు సీఐలు, ఎస్ఐలకు వెంటనే గాలింపు చర్యలు చేపట్టాలని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఆదేశించారు. అంతకు ముందు ఈ వార్త విన్న వెంటనే ఎమ్మెల్యే ఆదిమూలం దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు.

## చితికి చేరాలన్నా చిత్తడే...కన్నీటి బాటలో చివరి ప్రయాణం

### న వాగులు..వంకలు...బురద పొలాలే దారి

కేవీబీ పురం, జూలై 13 ప్రభాతవార్త:

మనిషి జీవితంలో చివరి ప్రయాణం ప్రశాంతంగా, గౌరవప్రదంగా సాగాలని ప్రతి ఒక్కరు కోరుకుంటారు. కానీ వగత్తూరు దళితవాడ ప్రజలకు ఆ అదృష్టం కూడా లేదు. బతికినంత కాలం కష్టాలు, అవమానాలు, కన్నీళ్ళతో గడిపిన జీవితానికి మరణించిన తరువాత కూడా ముళ్ళబాటే మిగులుతోంది. గ్రామానికి చెందిన వెట్టి కుప్పయ్య మృతి చెందగా, ఆయన మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకెళ్లేందుకు గ్రామస్తులు పడిన అవస్థలు ప్రతి మనిషిని కలచివేశాయి. శ్మశానానికి వెళ్లే రహదారి లేకపోవడంతో వాగులు, వంకలు, బురదతో నిండిన పంట పొలాల మీదుగా మృతదేహాన్ని భుజాలపై మోసుకుంటూ అంతిమయాత్ర నిర్వహించాల్సి వచ్చింది. కన్నీటి కళ్ళతో బంధువులు ముందుకు సాగుతుంటే వారి అడుగుల కింద బురద గుండెల్లో ఆవేదన మాత్రమే కనిపించాయి. ఈ దృశ్యాలు అక్కడున్న వారినే కాదు, చూసిన ప్రతి మనసును కదిలించేలా ఉన్నాయి. బతికున్నప్పుడు మా కష్టాలు ఎవరికి కనిపించవు. చనిపోయిన తరువాతైనా గౌరవంగా సాగనంపే దారి కూడా మాకు లేదా అంటూ గ్రామస్తులు కన్నీటి స్వరంతో ప్రశ్నిస్తున్నారు. దళితవాడ నుంచి శ్మశాన వాటికకు రహదారి నిర్మించాలని ఎన్నో సార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించినా, హామీలకే పరిమితమై సమస్య అలాగే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, ఒక మృతదేహాన్ని సైతం గౌరవంగా శ్మశనానికి తీసుకెళ్ళలేని పరిస్థితి ఉండడం ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని గ్రామస్తులు మండి పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశాన వాటికకు శాశ్వత రహదారి నిర్మించి ఈ కన్నీటి కథకు ముగింపు పలకాలని వగత్తూరు ప్రజలు కోరుకుంటున్నారు.

# శ్రీకాళహస్తి డివిజన్

## భారతీయ ఎన్నికల వ్యవస్థ ఆదర్శనీయమైనది



శ్రీకాళహస్తి జూలై 13 ప్రభాతవార్త: ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపబడిన మన భారత దేశంలో ఉన్న అన్ని రాజ్యాంగ వ్యవస్థ లలో భారతీయ ఎన్నికల వ్యవస్థ యొక్క పనితీరు ప్రపంచ దేశాలకు ఆదర్శనీయమైనది అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వన్నెకుల క్షత్రియ సంక్షేమం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి కొనియాడారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం సర్‌లో భాగంగా సోమవారం పట్టణంలోని జయరాంరావు వీధి సచివాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం. ఉమేష్ రావు, కార్యదర్శి వజ్రం కిషోర్, 50 52 బూత్ ల తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు తుపాకుల ప్రసాద్, గాజుల భగత్, భరత్, గణేష్, బిఎల్ఓ లు పద్మనాభ రెడ్డి, ఫర్హానా తదితరులు పాల్గొన్నారు.

## దిగువ కొనతనేరిలో ఓటర్ జాబితా పరిశీలన



తొట్టంబేడు, జులై 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం దిగువ కొనతనేరి పంచాయితీ నందు బిఎల్ఓ, బిఎల్ఏ లు గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో గాలి మురళి నాయుడు పాల్గొని ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించారు. సభలో ఓటర్ లిస్టులో ఉన్న అనర్హులైన వారిని, చనిపోయిన వారిని తొలగించడం, అర్హులైన వారి పేర్లను కొత్తగా చేర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెంకయ్య, పంచాయితీ కార్యదర్శి చంద్రిక, అంగన్వాడీ టీచర్ భారతి, స్కూల్ టీచర్ మోనిక, జనమాల రాజయ్య, బాబు, శివ తదితరులు పాల్గొన్నారు.

## క్వారీ గుంతల్లో యువకుడు గల్లంతు



బుచ్చినాయుడు కండ్రిగ, జులై 13 ప్రభాతవార్త: బుచ్చినాయుడుకండ్రిగ మండలం నెలవాయి పంచాయతీ లోని వేణుగోపాల పురానికి చెందిన సుకుమార్ (30) గల్లంతైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. వరదయ్య పాళెం మండలం మరదవాడ వద్ద గల క్వారీ గుంతల్లో సరదా ఈత కొట్టడానికి స్నేహితులతో కలిసి వెళ్లినట్లు కుటుంబసభ్యులు వివరించారు. స్నేహితు లందరూ కలసి స్నాన మాచ రించి బయటకు రాగా సుకుమార్ ఎంతకూ ఒట్టుకు రాకపోవటంతో స్నేహితులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఆదివారం రాత్రికావటంతో వేతకటానికి కష్టమైంది. సోమవారం ఉదయం మృతదేహం బయటకు తీయటానికి గజ ఈతగాళ్ళను నియమించారు. సోమవారం రాత్రి వరకు కూడా మృతదేహం బయట పడలేదు. దాంతో ఆ కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది.

## సర్‌లో 91,35 శాతం



విజయపురం, జూలై 13 ప్రభాతవార్త: ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గత నెల 15 నుంచి ఇప్పటి వరకు విజయపురం మండలంలో 91,35 శాతం సాధించినట్లు తహసీల్దార్ మునిశైలజ తెలిపారు. ఇంకా మిగిలిపోయిన 8.65 శాతం చనిపోయిన వారు, పర్మనెంట్ మైగ్రేషన్ కలిగిన వారిగా ఉన్నట్లు పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల పరిధిలోని బీఎల్‌వోలు, బీఎల్‌ఏలతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక ఒకే ఒక రోజు మిగిలి ఉందని ఎవరైనా అర్హులు తప్పిపోయి ఉంటే పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో కృష్ణయ్య, ఇతర మండల ఎన్నికల అధికారులు, బీఎల్‌వోలు, రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్‌ఏలు, పలువురు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ కోసం...ధన్వంతరి యాగం



రేణిగుంట, జూలై 13 ప్రభాతవార్త: యజ్ఞ యాగాలు ప్రపంచాన్ని సుభిక్షం చేస్తాయని జనసేన యువ నాయకుడు మిథున్ శాలి అన్నారు. రేణిగుంట సి ఆర్ ఎస్ నందున్న శ్రీకృష్ణ మందిరంలో సోమవారం ఘనంగా జనసేన నేత మిథుల్ శాలి ఆధ్వర్యంలో చికిత్స పొందుతున్న జనసేనని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ధన్వంతరి యాగం జరిగింది. ఈ సందర్భంగా మిథున్ శాలి మాట్లాడుతూ ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జనసేన అధిపతి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని యాగం నిర్వహిస్తున్నామని తెలిపారు. యజ్ఞం యాగాలు హిందూ ధర్మానికి మూలాలన్నారు. భారతదేశం సస్యశ్యామలమై అన్నపూర్ణగా మారడానికి అప్పట్లో రాజులు, పాలకులు చేసిన యజ్ఞాలు అన్నారు. ప్రతి ఒక్కరూ శ్రీకృష్ణుడు గీతలో చెప్పిన విధంగా ఆచరిస్తే ప్రపంచం శాంతిమయం అవుతుందని తెలిపారు. అంత మహిమగల యాగం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని శాస్త్రక్తంగా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## స్విమ్స్‌కు రూ.10 లక్షల విరాళం



తిరుపతి హెల్త్, జూలై 13 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆసుపత్రికి స్విమ్స్ శ్రీ బాలాజి ఆరోగ్య వరప్రసాదిని పథకానికి బెంగళూరు నగరానికి చెందిన మిథున్ వారి కుటుంబ సభ్యుల కోరిక మేరకు స్విమ్స్ హాస్పిటల్ పేద రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిగణలోనికి తీసుకొని ఈ విరాళం అందించినట్టు తెలిపారు. దాత తరపున తిరుపతి వాస్తవ్యులు వై. రాఘవేంద్ర చేతుల మీదుగా రు.10లక్షలు (పది లక్షల రూపాయలు) విరాళాన్ని డి.డి రూపంలో సోమవారం స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్‌కి అందజేశారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్ విరాళ దాత మిథున్‌కి, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి, ఇచ్చిన విరాళాన్ని పేద రోగుల వైద్య సేవలకు ఉపయోగిస్తామని తెలియజేశారు.

## పంచాయతీ స్థలం... దర్జాగా ఆక్రమణ!



తొట్టంబేడు, జూలై 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణ పొలిమేరల్లోని తొట్టంబేడు మండలం రెవెన్యూ దాఖలా లెక్కల్లో ఉన్న భూములను ఆక్రమణ దారులు దర్జాగా ఆక్రమించుకుంటున్నా పట్టించుకునే దిక్కులేదు. మండలంలోని ఒకచోట ఏమిటి ఖాళీ కనబడితే చాలు వేసేయ్ పాగా అన్నట్లుమారింది. కళ్ళిపూడి గ్రామానికి వెళ్ళు దారిలో తెలుగుగంగ పరిసరాల్లో ఎంచక్కా సుమారు పాతిక గుడిసెలు వెలిసినాయి. నేడు పట్టణానికి సమీపంలోని బసవయ్యపాళెం డంపింగ్ యార్డును దర్జాగా కబళిస్తున్నా పట్టించుకునే నాధుడు లేదు. ఆక్రమణదారులు ప్రభుత్వ స్థలాలను టార్గెట్‌గా ఆక్రమించుకుంటున్నారు. వివరాలు పరిశీలిస్తే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారికి కేంద్రాలను ఏర్పాటు చేసారు. అంటే డంపింగ్‌యార్డు. ఈ డంపింగ్ యార్డును కూడా ఆక్రమణ దారులు వదలి పెట్టలేదు. బసవయ్యపాళెం గ్రామానికి సమీపంలోని డపింగ్‌యార్డు ఓ రైసు మిల్లు పార్కింగ్‌గా మారింది. ఇక్కడ పని చేసే పంచాయతీ అధికారులు పట్టించుకోక పోవటంతో మిల్లర్లు ట్రాక్టర్లు, ట్రాలీలు పార్క్ చేసుకునే ప్రదేశంగా మారింది. చెత్త సేకరణ విభజన జరగాల్సిన చోట ప్రస్తుతం వరి బస్తాలు, ట్రాక్టర్లు దర్శన మిస్తున్నాయి. డంపింగ్ యార్డు అనే పేరుమాత్రమే మిగిలిందని చెబుతున్నారు. ఈ భూముల విలువ కోట్లలో ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇక్కడ డింపింగ్ యార్డుకు ప్రభుత్వం ఎంత స్థలం కేటయించింది. ఎంత మిగింది? అనే విషయాలు తేలాలంటే సర్వే నిర్వహించాల్సి ఉంది. పంచాయతీ స్థలం అప్పనంగా ఆక్రమణలకు గురౌతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవటం లేదు? ఇందులో ఎవరి ప్రమేయం ఉందనే విషయం తేలాల్సి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కబ్జా నుంచి కాపాడి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్ : రు.65వేల జరిమానా



శ్రీకాళహస్తి, జూలై 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో వాహన తనిఖీల్లో భాగంగా సోమవారం పలు తనిఖీలు చేస్తుండగా ఎలాంటి రికార్డుల్లేని ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎంవి ఇన్స్పెక్టర్ దామోదరం నాయుడు మీడియాకు తెలిపారు. వారి నుంచి రూ.65వేలు జరిమానను టాక్సు, పెనాలిటిగా వసూలు చేసినట్లు వివరించారు. ఇటీవల శ్రీకాళహస్తిలో పగలు రేయి తేడా లేకుండా స్వర్ణముఖి నది నుంచి ఇసుకను తోడేస్తున్నారు. ఈ ట్రాక్టర్లు నడిపే వారికి లైసెన్సులుండవు, మైనర్లు కూడా ట్రాక్టర్లను నడిపేస్తున్నారు. ఇక వాహనాలకు బ్రేకులు కూడా ఉండవు. అయితే ఈ నడిపే మైనర్ ఏదో ఒక రాజకీయ పార్టీ నాయకుని మద్దతుతో ఉంటాడు. దాంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా దామోదరం నాయుడు మాట్లాడుతూ ట్రాక్టర్ యజమానులు సరైన రికార్డులతో వాహనాలను రోడ్డుమీదకు తీసుకురావాలని సూచించారు. ముఖ్యంగా వాహనం కండిషన్, అర్‌సి, టాక్సు చెల్లింపు, పర్మిట్, డ్రైవర్లకు లైసెన్సు కల్గి ఉండాలన్నారు. శ్రీకాళహస్తిలో తిరుగుతున్న చాలా ట్రాక్టర్లకు సరైన నెంబర్లు కూడా లేదన్నారు. వ్యవసాయానికి వాడుతున్న ట్రాక్టర్లకు అనుమతి పొందిన ట్రాక్టర్లను ఇసుక రవాణాకు వాడరాదని అలా వాడితే చట్టరీత్యా కేసు నమోదు చేయబడుతుందన్నారు. ట్రాక్టర్ యజమానులు ఈ అంశాన్ని గుర్తించాలన్నారు. ఇసుక రవాణాకు తప్పని సరిగా 'పసుపు' బోర్డు కల్గి ఉండాలన్నారు. దీనికి అనుమతి తీసుకోవాలని ఎంవి ఇన్స్పెక్టర్ దామోదరం నాయుడు తెలిపారు.

## గుడిమల్లంలో మహాశైవాక్ష యోగం పూజలు



ఏర్పేడు, జూలై 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం గుడిమల్లం అలయంలో సోమవారం భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. మొదటి శైవాలయంగా ప్రఖ్యాతి గాంచిన గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరుని ఆలయంలో ఆరుద్ర సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా తిరుపతి శ్రీకాళహస్తి, పుత్తూరు ప్రాంతాల నుంచి కూడా భక్తులు కదలి వచ్చారు. దాంతో గుడిమల్లం గ్రామం భకక్తులతో కిట కిట లాడింది. అయితే వచ్చిన భక్తులకు ముందు జాగ్రత్తగా ఆలయ చైర్మెన్ బత్తల గిరినాయుడు పర్యవేక్షణలో ఆలయాధికారి మునిశేఖర్, సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు. కాగా ఇక్కడకు వచ్చిన భక్తులు ఎండలకు తట్టుకునేందుకు చక్కటి చలువ పందిళ్ళను ఏర్పాటు చేసారు. అరుదైన లింగానికి విశిష్ట అలంకారం జరిపారు. ఈ ఆలంకారం భక్తులను ఎంతో ఆకట్టుకుంది. ఇక వచ్చిన భక్తులు ఇబ్బంది లేకుండా భోజన సదుపాయాలు కల్పించారు. ఉదయం నుంచి బారులు తీరి కనబడ్డారు. వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొకుండా చక్కటి ఏర్పాట్లు చేసారు.

## ముక్కంటి సేవలో తిరుపతి టీడీపీ ఇన్‌ఛార్జ్ జేబీ



శ్రీకాళహస్తి, జులై 13 ప్రభాతవార్త: తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నూతన ఇన్‌ఛార్జ్ జేబి శ్రీనివాసులు సోమవారం శ్రీకాళహస్తి జ్ఞాన ప్రసూనాంబ సమేత వాయు లింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు కాసరం రమేష్ ఆధ్వర్యంలో దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థ ప్రసాదాలతో, శేష వస్త్రంతో సన్మానించారు. ఈ సందర్భంగా జె బి శ్రీనివాసులు మాట్లాడుతూ మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం కలిసి రావడం విశేషమని, భక్తులకు దర్శన సౌకర్యాలు కల్పించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి గంగమ్మ దేవస్థాన చైర్మన్ మహేష్ యాదవ్, జేబి ముఖేష్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

## తంగేళ్లపాలెం సొసైటీకి నాబార్డ్ ఉత్తమ అవార్డు



తొట్టంబేడు, జులై 13 ప్రభాతవార్త: నాబార్డ్ 45వ వార్షికోత్సవ సందర్భంగా రాష్ట్రంలోని 3 ఉత్తమ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఎంపిక చేశారు. ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి తొట్టంబేడు మండలం తంగేళ్ల పాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉత్తమ సొసైటీగా ఎంపికైంది. సంఘం చేసిన సేవలకుగాను ఈ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమం సోమవారం విజయవాడ నాబార్డ్ కార్యాలయం నందు జరిగింది. తంగేళ్లపాలెం సొసైటీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సీఈఓ పప్పు చిరంజీవి రెడ్డిని మేనేజింగ్ డైరెక్టర్ చేతుల మీదుగా మెమొంటోతో సత్కరించి, ఉత్తమ సంఘంగా ప్రశంస పత్రం అందజేశారు.

## ఈ నెల 16న మున్సిపల్ గదుల వేలం

శ్రీకాళహస్తి, జూలై 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని ఖాళీ గదులను ఈ నెల 16 వేలం వేయటానికి సిద్ధం చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎంవి కృష్ణారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ నడిబొడ్డులోని వైయస్ఆర్ సర్కిల్ వద్ద గల రూం నెంబర్ 3, 34,35,38లకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే కొత్తపేట బస్టాండు వద్ద ఉన్న షాపు నెంబర్ 21 పిఎంఆర్ షాపింగ్ కాంప్లెక్సు సినిమావీధి నందలి షాపులు7,41, 43,45, 46, 47 గదులకు బహిరంగ వేలంను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ షాపులను ఈ నెల 16న ఉదయం 11 గంటలకు వేలం పాటలు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. దరఖాస్తు ఈ నెల 15 సాయంత్రం 4గంటల లోపల అందించాలని కమిషనర్ కృష్ణారెడ్డి సూచించారు.

## 2.7 కిలోల గంజాయి పట్టివేత



శ్రీకాళహస్తి రూరల్, జులై 13 ప్రభాతవార్త : ఊరందూరు -పంగూరు రోడ్డులోని ప్రకాష్ ఫెర్రస్ ఫ్యాక్టరీ ఎదురుగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ ఇబ్రహీం, పోలీసులు తనిఖీలు నిర్వహించగా జితేందర్ కుమార్, 22 అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నారు. ఈ సందర్భంగా సిఐ ఇబ్రహీం మాట్లాడుతూ ముద్దాయి నుండి 2 కిలోల 700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అతని వివరాలు జితేందర్ కుమార్ బసోడి గ్రామం, నలంద జిల్లా, బీహార్ రాష్ట్రంగా గుర్తించి కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్కు తరలించారు. విచారణలో ముద్దాయి గంజాయిని తన సొంత గ్రామం నుండి ఇక్కడికి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

## ఓటర్ల పరిశీలన 99.66 శాతం పూర్తి

### 33వేల ఓట్లు తగ్గాయి: ఆర్‌డిఓ



శ్రీకాళహస్తి, జూలై 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో భారత ఎన్నికల సంఘం ప్రకటించిన మేరకు ఓటర్ల పరిశీలన కార్యక్రమాలు పూర్తి అయ్యాయని ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి సోమవారం తెలిపారు. నెల రోజుల పాటు నిర్వహించిన సర్వేల్లో 99.66శాతం పూర్తి అయినట్లు ఆయన మీడియా సమావేశంలో తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సుమారు 33వేల ఓట్లు తగ్గినట్లు వివరించారు. ఆర్‌డిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజక వర్గంలో 2,49,123 మందది ఓటర్లున్నారని పరిశీలనల్లో సుమారు 33వేల ఓట్లు సందిగ్దంలో ఉన్నారన్నారు. తాముమూడు విభాగాలుగా విభజించి నట్లు వివరించారు. మ్యాపింగ్‌లో 2,15,123 ఓట్లు గుర్తించామన్నారు. ఆన్‌మ్యాపింగ్‌లు బయట వెళ్ళినవారు మృతి చెందిన వారు 33,166 ఉన్నార న్నారు. ఇందులో 9027 మంది మృతి చెందారని ధృవీకరించినట్లు తెలిపారు. కాగా బదలాయింపు 14,552 మంది ఉన్నారు. రెండు చోట్ల ఓట్లు ఉన్న వారు 3166 ఉన్నారన్నారు. ఒక్క శ్రీకాళహస్తిఅర్బన్ రేణిగుంటల్లో మాత్రమే 21 వేల ఓట్లు తొలగించాల్సి వచ్చిందన్నారు. 2002 తో పొల్చుకుంటే తల్లిదండ్రులతోనూ, ముఖాలు గుర్తించని ఓట్లకు సంబంధించి మళ్ళీ పరిశీలనకు ఫారం 8 ఇవ్వనున్నట్లు ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి వివరించారు. ఇప్పటి వరకు 1లక్షా 90వేల ఓట్లు మాత్రం కన్ఫర్మ్ అయ్యిందన్నారు. ఎవరూ ఓట్లు పోతాయని భయపడాల్సిన అవసరం లేదన్నారు. సెప్టెంబర్ 21న తుది జాబితాలు ముద్రిస్తామన్నారు.

## సర్ ను సద్వినియోగం చేసుకోండి



శ్రీకాళహస్తి, జులై 13 ప్రభాతవార్త: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి పిలుపు నిచ్చారు. ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు క్షేత్రస్థాయిలో పర్యటించి సర్ అవశ్యకతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడువులోగా ఎన్యూ మరేషన్ పత్రాలను సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ కరీముల్లా శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్రరెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నాగూర్, నాగరాజు, మహేష్, అరుణ్, చరణ్, సారథి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



తొట్టంబేడు, జులై 13 ప్రభాతవార్త: మండలంలోని కాసరం గ్రామ ఎంపీపీ పాఠశాలలో చదువుతున్న 66 మంది విద్యార్థులకు శ్రీకాళహస్తిలోని విక్రమ్ కళాశాల యాజమాన్యం విద్యా సామగ్రిని పంపిణీ చేసింది. ఈ మేరకు విక్రమ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కె.మునిలక్ష్మి, డాక్టర్ జి.చంద్రశేఖర్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యాదానం చాలా గొప్పదని అన్నారు. విద్యా సామగ్రిని అందించిన కళాశాల యాజమాన్యా నికి పాఠశాల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ కళాశాల తరపున ప్రిన్సిపల్ ఎం.మల్లికార్జున్, సునీల్, ఏ.రామకృష్ణ, జడ్పీ హైస్కూల్ హెడ్ మాస్టర్ ఎంపీపీ, జడ్పీహెచ్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొండెక్కిన మాంసం ధరలు...పట్టించుకోని అధికారులు!



నారాయణవనం, జూలై 13 ప్రభాతవార్త : ఇటీవల కాలంలో మండుతున్న ఎండలకు ఏమాత్రం తగ్గకుండా మాంసం ధరలు భగ..భగా మండిపోతున్నది. మాంసం ప్రియులు ఆదివారం వస్తే కోడి మాంసం, మటన్ సెంటర్ల దగ్గర కొనుగోళుకు క్యూ కడుతున్నారు. అయితే గత కొద్ది రోజులుగా మండుతున్న ఎండలను సాకుగా చూపించి వ్యాపారస్తులు సిండికేట్‌గా ఏర్పడి ధరలను విపరీతంగా పెంచేస్తున్నారు. దీంతో కోడి మాంసం 340 ధర పలుకుతోంది. అలాగే మటన్ కూడా 850 నుంచి 900 రూపాయాల ధర పలుకుతున్నది. ధనవంతులు ఎక్కువ ధర పెట్టి కొనుగోళు చేస్తున్నప్పటికి పేదలు మాత్రం కొనుగోళు చేయలేకపోతున్నారు. ధరలను వ్యాపారస్తులు ఇలా పెంచుకుంటూ పోతున్నప్పటికి అడిగే దిక్కే లేకుండా పోయింది. దీంతో ఆడిందే ఆట పాడిందే పాటగా వున్నది. కావున సంబందింత అధికారులు నారాయణవనంలో మాంసం ధరలపై దృష్టి సారించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

## త్వరలో పుస్తక నిక్షిప్త కేంద్రం ఏర్పాటు: రెడ్డివారి

### -బండారుపల్లిలో బీడీసీ సెంటర్ ఏర్పాటు చేయాలని వినతి



ఏర్పేడు, జులై 13 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం బండారుపల్లి గ్రామంలో గ్రంథాలయాలకు సంబంధించి బుక్ డిపాజిట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డికి వినతి పత్రం అందజేశారు. బండారుపల్లి గ్రామం మండలంలోని పెద్ద గ్రామాల్లో ఒకటి. సుమారు 3500 మంది జనాభా కలిగిన ఈ గ్రామంలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఉన్నారు. గ్రామంలో సమాచారం తెలిసే నిమిత్తం, విద్యార్థుల్లో పఠన అలవాట్లు పెంచేందుకు గ్రామానికి గ్రంథాలయాల సంబంధిత బుక్ డిపాజిట్ సెంటర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ద్వారా ఈ సెంటర్ ఏర్పాటు చేయాల్సిందిగా చైర్మన్ గురువారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. బండారుపల్లి గ్రామస్తుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన గురువారెడ్డి అత్యంత తొందరలో బండారుపల్లి గ్రామంలో కూడా ప్రజలకు, విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పుస్తక నిక్షిప్త కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివశంకర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం యాదవ్ గ్రామస్తులు నాగమునిశెట్టి, శంకర్ రెడ్డి, మాధవరెడ్డి, మునికృష్ణారెడ్డి, రాజు, మబ్బురామ్ రెడ్డి, రవిచంద్ర, సురేంద్ర, చెంచుమున్ రెడ్డి, బాలకృష్ణ, మీనాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గోడౌన్‌లో నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

పుత్తూరు రూరల్, జూలై 13 ప్రభాతవార్త: పుత్తూరు వ్యవసాయ మార్కెట్ యార్డులోని నాగరాజు మండి ఎదురుగా గోడౌన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చే లోపు కొంత మేర స్థానికులు మంటలను అదుపు చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది పూర్తి స్థాయిలో మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో సుమారు లక్ష రూపాయల మేర ఆస్తి నష్టం వాటిలినట్టు బాధితులు తెలిపారు.

## సమష్టి కృషితో "సర్" విజయవంతం : డిఆర్‌ఓ





రామచంద్రాపురం, జూలై 13 ప్రభాతవార్త: సమష్టి కృషితో సర్ విజయవంతం చేయగలి గామని డిఆర్‌ఓ నరశింహులు అన్నారు. సోమ వారం దిగువ రామాపురంలో బిఎల్‌ఓలు, బిఎల్‌ఏలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహి ంచారు. ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిర్ధేశించిన మార్గ దర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, కచ్చితత్వంతో ఓటరు జాబితా రూపొందించడం జరిగిందన్నారు. మండలంలో నిర్దిష్ట గడువు లోపు సర్ విజయవంతం చేయడం అభినందనీ యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్‌ఓ మధుసూదన్ రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**-భూ ఆక్రమణలపై ఉక్కుపాదం : తహశీల్దార్**

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ల్యాండ్ గార్బింగ్ యాక్ట్ నమోదు చేసి ఉక్కు పాదంతో అణచివేస్తామని తహశీల్దార్ మధుసూదన్ రావు హెచ్చరించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనుప్పల్లి, చుట్టుగుంట రామాపురం రెవెన్యూ పరిధిలో భూ ఆక్రమణలపై ఫిర్యాదులు అందుతున్నట్లు తెలిపారు. తమ దృష్టికి వచ్చిన పలు ఆక్రమణలలో రెవెన్యూ బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# తిరుపతి డివిజన్

# "స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్" సర్ గడువు పొడిగించండి.!

## సిపిఐ మండల కార్యదర్శి ఎన్.శ్రీరాములు



చంద్రగిరి, జూలై 13 ప్రభాతవార్త: ఓటర్ల జాబితాను పారదర్శకంగా, కచ్చితంగా మార్చడానికి భారత ఎన్నికల సంఘం చేపట్టిన "స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్" (సర్) కార్యక్రమం గడువు మరో మూడు నెలలు పెంచాలని సిపిఐ మండల కార్యదర్శి ఎన్.శ్రీరాములు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సర్ కార్యక్రమం కోసం బిఎల్ఓలు చేస్తున్న వివరాల సేకరణ ప్రక్రియను భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. సర్వే ముసుగులో అర్హులైన ఓట్లను తొలగించి దొంగ ఓట్లకు సహకరించే విధంగా వుందని ఆరోపించారు. అధికారంలో వున్న పార్టీ సర్ కార్యక్రమం నిర్వహణ ప్రక్రియలో అవకతవకలకు పాల్పడే అవకాశం వుందని దుయ్యబట్టారు. ఎన్నికల అధికారులు రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. వలస కూలీలు, ఇతర ప్రాంతాలలో ఉద్యోగాలకు వెళ్ళిన వారి ఓట్లను సరి చూసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. జూలై 14తో గడువు ముగుస్తున్నందున మరో మూడు నెలలు గడువు పెంచాలని కోరారు.

# జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో నారాయణ ప్రభంజనం

### మహతి ఆడిటోరియంలో 2,000 మందితో విజయోత్సవ్-2026

### ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఘన సన్మానం.. ఏపీ టాపర్‌తో నారాయణకు జాతీయ స్థాయిలో గుర్తింపు



తిరుపతి విద్య జూలై 13 ప్రభాత వార్త

జేఈఈ అడ్వాన్స్‌డ్-2026లో స్థానిక నారాయణ విద్యా సంస్థలు జాతీయ స్థాయిలో విశిష్ట ఫలితాలు నమోదు చేశాయి. ఈ విజయాలను పురస్కరించుకుని తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో నారాయణ విజయోత్సవ్-2026 కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ నారాయణ విద్యా సంస్థలకు చెందిన సుమారు 2,000 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు వేడుకలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అకాడమిక్ హెడ్ డా. ప్రమీల మాట్లాడుతూ, జేఈఈ అడ్వాన్స్‌డ్-2026లో నారాయణ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 15వ ర్యాంకు సాధించిన విద్యార్థి ఆంధ్రప్రదేశ్‌లో చదివిన అభ్యర్థులలో టాపర్‌గా నిలవడం సంస్థకు గర్వకారణమని పేర్కొన్నారు. ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో అన్వి వసంతు 198వ ర్యాంకు, నరేంద్రబాబుగారి మహిత్ 238వ ర్యాంకు, గొర్లె ప్రవీణ్ 296వ ర్యాంకు, మద్దిపట్ల చక్ర శ్రీకర్ 917వ ర్యాంకు సాధించి సంస్థ ప్రతిష్ఠను మరింత పెంచారని వెల్లడించారు. ఈ ఏడాది ఫలితాల్లో నారాయణ విద్యార్థులు టాప్-20లో ఒక ర్యాంకు, టాప్-300లో నాలుగు ర్యాంకులు, టాప్-1000లో ఐదు ర్యాంకులు, టాప్-5000లో తొమ్మిది ర్యాంకులు, టాప్-10000 లో 21 ర్యాంకులు సాధించడం విశేషమని తెలిపారు. ఈ ఫలితాల ఆధారంగా 120కు పైగా మంది విద్యార్థులు ఐఐటీ లు, ఎన్ ఐ టి లు, ఐఐఐటీలు వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీజీఎం కొండలరావు మాట్లాడుతూ, తిరుపతి జిల్లాలోని నారాయణ విద్యా సంస్థల నుంచి 120కు పైగా మంది విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీ సీట్లు సాధించడం విద్యార్థుల కృషి, అధ్యాపకుల అంకితభావం, తల్లిదండ్రుల ప్రోత్సాహానికి నిదర్శనమని అన్నారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని జాతీయ స్థాయి ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం కోర్ డీన్ శ్రీనివాసరావు, డీన్లు, ప్రిన్సిపాల్స్ కలిసి జేఈఈ అడ్వాన్స్‌డ్-2026లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులను జ్ఞాపికలు, పతకాలు అందించి ఘనంగా సత్కరించారు. విద్యార్థుల విజయాలను భారీ ఎల్ఈడీ తెరపై ప్రదర్శించగా సభికులు కరతాళధ్వనులతో అభినందించారు.

## బిఎల్ఓలు బిఎల్ఎలతో చంద్రగిరి ఎమ్మెల్యే సతీమణి సుధారెడ్డి సమీక్ష



తిరుచానూరు, జూలై 13 ప్రభాతవార్త

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పై సోమవారం తిరుచానూరు సచివాలయం నందు క్లస్టర్ ఇంచార్జ్ తో కలసి బిఎల్ఓ లు బిఎల్ఎ లతో సుధా రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా బిఎల్వోలు బి ఎల్ ఏ లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సుధా రెడ్డి మాట్లాడుతూ డోర్ టు డోర్ ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియ పురోగతిపై బిఎల్వోలతో సమీక్ష నిర్వహించి ఎన్నిమరేషన్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని బిఎల్ఓ కోరామని . ఎస్ ఐ ఆర్ ప్రక్రియ నిర్వహణ పై బిఎల్ఓ లతో మాట్లాడగా వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుచానూరు గ్రామ అధ్యక్షుడు కిషోర్ రెడ్డి హరి రామ్ రెడ్డి, సాయి రాయల్, పాండితదితరకూటమి నాయకులు పాల్గొన్నారు

## యోగి మల్లవరం ఆలయంలో పోటెత్తిన జనం



తిరుచానూరు జూలై 13 ప్రభాతవార్త

యోగి మల్లవరం శివాలయంలో పరాసరేశ్వర స్వామి కి ఆరుద్ర నక్షత్రం మరియు అరుదైన శైవ యోగం కారణంగా ప్రత్యేక పూజలు నిర్వహించారుసోమవారం మాస శివరాత్రి ఆరుద్ర నక్షత్రం కలిసి రావడంతో భక్తులు యోగిమల్లవరం ఆలయానికి విశేషంగా విచ్చేశారు. ఈ అరుదైన శైవ పర్వ దినాన్ని పురస్కరించుకొని స్త్రీలు ఉదయాన్నే పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేసి దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారుఈ అరుదైన పర్వదినం వందేళ్ళకు ఒకసారి వస్తుందని ఈరోజు ఈశ్వర ఆరాధన భక్తిశ్రద్ధలతో చేయడం వలన ఆ పరమేశ్వరుడు కటాక్షి స్తాడని భక్తుల నమ్మకం. ఆలయ చైర్మన్ నీలకంఠం మరియుఆలయ బోర్డు మెంబర్ శేషాద్రి ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా క్యూలో క్రమ పద్ధతిలో వెళ్లడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు సైతం వీరి యొక్క చిత్తశుద్ధిని కొనియాడారు.

## సభ్యులను నమోదు చేయిద్దాం

### – సంఘాన్ని బలోపేతం చేద్దాం



పుత్తూరు రూరల్, జూలై 13 ప్రభాతవార్త:

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం కోరి ఈ సమావేశంలో గౌరవ సభ్యులకు ఈ ఫైలింగ్ చేసుకోవడానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. పుత్తూరు విశ్రాంత ఉద్యోగుల భవనంలో సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించిన గుణశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలను మరిన్ని నిర్వహించడానికి సంఘంలోసభ్యుల నమోదు మరింతగా పెంచడానికి ప్రస్తుత సభ్యులు కృషి చేయాలని ఆర్థికంగా మరింత బలోపేతంగా ఈ సంఘాన్ని అందరం కలసిసమిష్టిగా నిర్మించుకోవాలని ఆయన కోరారు. తరువాత కరకంబాడి అమర ఆస్పత్రి డాక్టర్ డాక్టర్ శంకర్ క్రిటికల్ కేర్‌పై సభ్యులకు అవగాహన కల్పించారు. సభ్యులకు ఈ ఫిలింగ్ చేసుకోవడానికి ఆనందబాబు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, కృష్ణ సముద్రం కన్నప్ప స్కూలు అసిస్టెంట్ సాంకేతిక సహకారాలు అందజేశారు. విద్య, సామాజిక సేవ చేసినందుకు గాను భారత్ వర్చువల్ యూనివర్సిటీ బెంగళూరు వారు ఫార్ జెనీవా బెంగళూరులో మే 16 తేదీ సర్వీస్ గుర్తించి డాక్టరేట్ లైఫ్‌టైం అచ్చుమెంట్ మెడల్ పొందిన త్యాగరాజుల నాయుడుని సంఘం ఘనంగా సత్కరించింది. అలాగే నూతనంగా సభ్యత్వం పొందిన సభ్యులకు ఆహ్వానం పలికారు. ముంతాజ్ బీబీ వారు 6వ కంతులో భాగంగా 5 వేలు, త్యాగరాజుల నాయుడు 5 వేలు సంఘం అభివృద్ధికి ఆర్థిక సాయం చేశారు. లోకేశ్వరి భోజన వసతి కల్పించారు. ఈ సమావేశంలో కుప్పయ్య, రామలింగం, యుగంధర్ రాజు, రవిశంకర్, కృపావరమ్మ, బాలసుబ్రహ్మణ్యం, రామచంద్ర రాజు, నారాయణ స్వామి, రాజగోపాల్, రామమూర్తి రాజు, మాలినిదేవి, సీతమ్మ, రజియా, మల్లికా, సుకుమార్, నారాయణరెడ్డి, వెంకటకృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనాల సాధన కొరకు కదలిరండి - సీఐటీయూ



కేవీబీ పురం, జూలై 13 ప్రభాతవార్త:

ఈ నెల 30,31 తేదీలల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో స్కీం వర్కర్లు, కార్మికులు పాల్గొనాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. పిచ్చాటూరులో సోమవారం సీఐటీయూ ప్రాంతీయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్కీం వర్కర్లకు ఇతర పరిశ్రమలు పనిచేసే వర్కర్లకు కనీస వేతనంగా 26 వేలు ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 30,31 తేదీల్లో తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో జిల్లాలోని స్కీం వర్కర్లు కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరుగుతుండడంతో గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి ప్రజల పైన భారాలు మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనంగా 26 వేలు నెలకు ఇవ్వకపోతే ఆ కుటుంబాలు వీధిన బడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాల సాధన కొరకు కార్మికులందరూ కలసికట్టుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై పోరాటంచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మెలుగు రమేష్, సీఐటీయూ పిచ్చాటూరు ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజు, అంగన్‌వాడీ యూనియన్ పిచ్చాటూరు ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు రాజేశ్వరి, ఇంద్రాణి, పూర్ణిమ్మ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు అనుభారతి, లావణ్య, నాయకులు మునిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలు మృతికి జడ్పీటీసీ సంతాపం



నారాయణవనం, జూలై 13 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని పానాయణవనం మేజర్ పంచాయతీ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు చిత్తూరు అమాసరెడ్డి భార్య చిత్తూరు వరదమ్మ(80) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న చిత్తూరు ఉమ్మడి జిల్లాల జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్, టిడిపి సత్యవేడు నియోజకవర్గ బిఎల్ఎల ఇంచార్జ్ కోనేటి సుమన్‌కుమార్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వరదమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



పుత్తూరు రూరల్, జూలై 13 ప్రభాతవార్త:

పుత్తూరు మున్సిపల్ పరిధి, మహాలక్ష్మిపురం పున్నమి చెన్నై-తిరుపతి హైవే రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా అటు వైపు వెళుతున్న కారు ఢీకొనింది. దీంతో వెంటనే స్థానికులు పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి అక్కడ చికిత్స పొంది మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాలకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పుత్తూరు పోలీసులు తెలిపారు. మృతుడి కుడి చేతిపై చంద్రశేఖర్ అనే పచ్చబొట్టు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే పుత్తూరు పోలీస్‌స్టేషన్‌లో తెలియపరచాలని పోలీసులు తెలిపారు.

## ఆలయాల్లో ఘనంగా అమావాస్య పూజలు



నారాయణవనం, జూలై 13 ప్రభాతవార్త : మండలంలోని నారాయణవనం మేజర్ పంచాయతీలో అవదూతగా వెలసిన తాతా సొరకాయులు స్వామి ఆలయంలో సోమవారం రాత్రి అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం శుద్ధి, నిత్యకైంకర్య పూజా కార్యక్రమాలను నిర్వహించిన తర్వాత అభిషేకం చేసారు. నెయ్యి, కొబ్బరినీరు, పశుపు, కుంకమ, చందనం, విభూది వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకం చేసిన తర్వాత పుష్పాలతో అలంకరించారు. రాత్రి హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం, రాత్రి వందలాది మంది భక్తులకు అన్నదాన ం నిర్వహించారు.

## బలవంతపు ఓట్లతో ఎవరూ నమోదు చేయవద్దు



కేవీబీపురం, జూలై 13 ప్రభాతవార్త:

మండలంలోని కాట్రపల్లి గ్రామ పంచాయతీ కాట్రపల్లి సచివాలయంలో సోమవారం సర్ ప్రోగ్రాంలో ఓటర్ల జాబితా నమోదు కార్యక్రమంలో ఓటరు నమోదులో కుండ నమోదు చేయాలని, బలవంతపు ఓట్లతో ఎవరూ నమోదు చేయవద్దని బీఎల్‌వోలకు వైసీపీ పార్టీ కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, ఎంపీపీ రాయదుర్గం మునిలక్ష్మినందకుమార్ పలు సూచనలు అందించారు. అవసరమైతే మరో రోజు గడువు తీసుకుని ఓటరు నమోదు ప్రక్రియ నిర్వహించాలని వారు సచివాలయ అధికారులను కోరారు. అనంతరం సర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి డ్రైవర్లపై మండిపడ్డ విద్యార్థులు



రామచంద్రాపురం, జూలై 13 ప్రభాతవార్త:

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత బస్‌పాస్‌లను మంజూరు చేసిందని అయితే ఆర్టీసి డ్రైవర్లు విద్యార్థులు బస్సు ఆపితే ఆపకుండా వెళ్ళడంపై సోమవారం కమ్మకండ్రిగ చేకూరి నాగమ్మ ఎర్రమ నాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నోకష్టాలు పడి పాఠశాలకు వస్తున్నట్లు వాపోయారు. తమకు ప్రభుత్వం ఉచిత పాస్‌లు మంజూరు చేసినప్పటికీ ఆర్టీసి బస్ డ్రైవర్లు, కండక్టర్లు బస్సులు ఆపకపోగా విద్యార్థుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, విద్యార్థుల పట్ల ఆర్టీసి సిబ్బంది ప్రవర్తన విడ్డూరంగా వుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను తమకు అందకుండా చేయడం ఆర్టీసి సిబ్బంది లక్ష్యంగా పెట్టుకున్నట్లు వాపోయారు. ఇకనైనా ఆర్టీసి సిబ్బంది మహిళలు, విద్యార్థుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని కోరారు. అలా చేయని పక్షంలో విద్యార్థి సంఘం నాయకులతో కలసి నిరసనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## నేడు చంద్రగిరిలో రాములవారి కళ్యాణం

చంద్రగిరి, జూలై 13 ప్రభాతవార్త:

చంద్రగిరిలోని టిటిడి అనుబంధ శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో మంగళవారం శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవం కున్నల పండువగా నిర్వహించనున్నారు. రాములవారి జన్మనక్షత్రం పునర్వసును పురస్కరించుకుని ఉదయం 10 గంటలకు ఆలయంలో శ్రీసీతారాముల కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ కళ్యాణోత్సవానికి హాజరయ్యే దంపతులకు టికెట్ ధరను రూ.300/-లు నిర్ణయించారు. భక్తులందరూ పాల్గొని స్వామి ఆశీస్సులతో తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ అధికారులు కోరారు.

కెనరా బ్యాంక్ Canara Bank Together we can
వెంకటగిరికోట శాఖ (5702)
ఫోన్: 8333818518

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు తెలియజేయడమేమనగా మీరు మా బ్యాంకు వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి పొందిన రుణమును తిరిగి చెల్లించలేదు. పలుమార్లు నోటీసులు పంపినను బట్వాడా కాకుండా తిరిగి వచ్చినది. **29.08.2026**వ తేది లోపు బకాయిలు,ఇతర ఛార్జీలను చెల్లించి తనఖా వుంచిన సెక్యూరిటీలను తిరిగి పొందగలరు. లేనియెడల బ్యాంకు శాఖ ఆవరణంలో **తేది:31.08.2026 సా.4.00గం॥లకు** లేదా బ్యాంకు **నిర్ణయించిన ఏదేని తేదీలలో వేలం వేయుటకు** బ్యాంకు వారికి అధికారం కలదు.

| వ. నెం. | ఖాతానెం. | రుణగ్రహీత పేరు & చిరునామా | బంగారు బరువు (గ్రాములలో) | బకాయి మొత్తం ఛార్జీలతో రూ. |
|---|---|---|---|---|
| 1 | 180146045494 | వి.నారాయణప్ప, తండ్రి వెంకటప్ప, 2-32, దయాలపల్లి గ్రామం, నేర్నిపల్లె పోస్ట్, వెంకటగిరికోట మండలం | 14.30 | 65946.00 |

వి.కోట, తేది: 13.07.2026 సం॥ బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంకు

కెనరా బ్యాంక్ Canara Bank Together we can
తిరుపతి జీవకోన రోడ్డు శాఖ (5925)
ఫోన్: 8333818517

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు తెలియజేయడమేమనగా మీరు మా బ్యాంకు వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి పొందిన రుణమును తిరిగి చెల్లించలేదు. పలుమార్లు నోటీసులు పంపినను బట్వాడా కాకుండా తిరిగి వచ్చినది. **29.08.2026**వ తేది లోపు బకాయిలు,ఇతర ఛార్జీలను చెల్లించి తనఖా వుంచిన సెక్యూరిటీలను తిరిగి పొందగలరు. లేనియెడల బ్యాంకు శాఖ ఆవరణంలో **తేది:31.08.2026 సా.4.00గం॥లకు** లేదా బ్యాంకు **నిర్ణయించిన ఏదేని తేదీలలో వేలం వేయుటకు** బ్యాంకు వారికి అధికారం కలదు.

| వ. నెం. | ఖాతానెం. | రుణగ్రహీత పేరు & చిరునామా | బంగారు బరువు (గ్రాములలో) | బకాయి మొత్తం ఛార్జీలతో రూ. |
|---|---|---|---|---|
| 1 | 180462011463 | ఎస్.రాజేంద్రప్రసాద్, తండ్రి రామక్రిష్ణారెడ్డి, 21-3-122 సత్యనారాయణపురం, తిరుపతి - 517501 | 59.00 | 7,22,000 |

తిరుపతి, తేది: 13.07.2026 సం॥ బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంకు

# జిరాక్స్ షాప్ మూసివేతతో ఎస్వీయూ విద్యార్థుల ఇక్కట్లు

### వారంలోగా అందుబాటులోకి తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్.. : స్పందించిన రిజిస్ట్రార్



తిరుపతి విద్య, జూలై 13 ప్రభాత వార్త

ఎస్వీయూ లో ఏడాదికి పైగా జిరాక్స్ షాప్ మూతపడడంతో విద్యార్థులు, పరిశోధకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. ప్రకాశం భవనం, కెమిస్ట్రీ భవనం మధ్య ఉన్న జిరాక్స్ కేంద్రం మూసివేయబడటంతో ప్రతిరోజూ సర్టిఫికెట్లు, ప్రాజెక్ట్ నివేదికలు, పరిశోధన పత్రాలు, ఇతర విద్యా సంబంధిత డాక్యుమెంట్ల జిరాక్స్‌ల కోసం సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని బాలాజీ కాలనీకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఈ సమస్యను పలుమార్లు విశ్వవిద్యాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం దిశగా చర్యలు చేపట్టలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సమస్యలపై అధికారులు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు వారంలోపు జిరాక్స్ షాప్‌కు సంబంధించిన టెండర్ ప్రక్రియను పూర్తి చేసి సేవలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు, పరిశోధక విద్యార్థి అశోక్ కుమార్ మాట్లాడుతూ, విశ్వవిద్యాలయంలో రోజురోజుకూ విద్యార్థుల సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. మరుగుదొడ్ల కొరత, పరీక్షల ఫలితాల విడుదలలో జాప్యం, ఇప్పుడు జిరాక్స్ కేంద్రం లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రచార కార్యక్రమాలపై చూపుతున్న శ్రద్ధను విద్యార్థుల ప్రాథమిక అవసరాల పరిష్కారంపైనా చూపాలని అధికారులను కోరారు. పీహెచ్‌డీ, పీజీ విద్యార్థులు తమ పరిశోధనలకు సంబంధించిన పత్రాల జిరాక్స్‌ల కోసం ప్రతిరోజూ సమయం, ధనం వెచ్చిస్తూ బయటకు వెళ్లాల్సి వస్తోందని ఆయన తెలిపారు. వారంలోపు జిరాక్స్ షాప్‌ను పునఃప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని, లేనిపక్షంలో అధికారుల ఛాంబర్లలో ఉన్న జిరాక్స్ యంత్రాలను విద్యార్థుల వినియోగానికి అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందన లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

### రిజిస్ట్రార్ స్పందన

ఈ విషయమై ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడును వివరణ కోరగా, కొత్త టెండర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు విద్యార్థులు, పరిశోధకులు అవసరమైన జిరాక్స్ ప్రతులను రిజిస్ట్రార్ ఛాంబర్‌లో తీసుకోవచ్చని సూచించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక ఏర్పాట్లు చేసినట్లు ఆయన వెల్లడించారు.

# టీచర్ల కొరతతో...ఇబ్బంది పడుతున్న విద్యార్థులు




దొరవారిసత్రం, జూలై 13 ప్రభాతవార్త: అసలే ప్రభుత్వ స్కూల్లో విద్య అంతంత మాత్రమేగానే ఉన్నా, టీచర్ల కొరకు విద్య పూర్తిగా అటకెక్కిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మోడల్ ప్రైమరీ పాఠశాలలు (1 నుంచి 5వ తరగతి) 14 (1 నుంచి 2వ తరగతి) ఫౌండేషన్ స్కూల్స్ 41 ఉండగా ఈ పాఠశాలలో 1218 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 52 పాఠశాలలో విద్యార్థులకు విధులు బోధించేందుకు మండలంలో సుమారు వందమంది టీచర్లు గాను గత ఏడాది నుంచి 50 మంది టీచర్స్ మాత్రమే ఉన్నారు. ఇది ఇలా ఉండగా 12 పాఠశాలకు పూర్తిగా టీచర్లు లేకపోవడం ఇక్కడ విద్యార్థులు చదువులు పూర్తిగా అటకెక్కాయని, విద్యార్థి తల్లిదండ్రులు అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న ఫలితం లేదని ఆరోపిస్తున్నారు. విద్యార్థులు ఉన్న చోట ఉపాధ్యాయులు లేకపోవడం వలన విద్యార్థులు చదువు అయోమయంగా మారిందని ఓవైపు ఉపాధ్యాయులు. మరోవైపు పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**- మారిన విద్యా విధానం వల్ల కష్టాలు:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్యలో మార్పులు తీసుకొచ్చింది. గాని మోడల్ ప్రైమరీ, ఫౌండేషన్ పాఠశాలకు అవసరమైన వసతులు ఏర్పాటు నుంచి ఉపాధ్యాయ నియమకం వరకు ఎలాంటివి కల్పించక పోవడంతో గ్రామాల్లో విద్య చతికిల పడిందని రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాలు ప్రకారం 1 నుంచి 5 తరగతులకు ఒక్కొక్క టీచర్ చొప్పున ఐదుగురు టీచర్లను నియమించాలి ఇవేవీ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో కల్పించకపోవడం వలన ప్రాథ మిక విద్య పేద విద్యార్థులకు శాపంగా మారిందని ఈ మండలంలో సుమారుగా 12 పాఠశాలలో టీచర్లు లేకపోవడం విద్యార్థులకు విద్య అందడం లేదని రోజుకు ఒక టీచర్ డిప్యూటేషన్ రావడం వలన పిల్లలు చదువు ముందుకు సాగడం లేదని ఆయా ప్రాంతాల్లో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో ప్రభుత్వ అందించే విద్య పూర్తి స్థాయిలో అందకపోవడం వలన పిల్లల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాల వైపు మొగ్గు చూపక తప్పడం లేదని తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఇకనైనా విద్యాధికారులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈ మండలంలో టీచర్స్ కొరత లేకుండా చూడాలని పిల్లల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

## వెండి శిరోధార బహూకరణ



సూళ్లూరుపేట, జూలై 13 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీ నాగేశ్వర స్వామి దేవస్థానానికి వెండి శిరోధారను సోమవారం బహూకరించారు. సూళ్లూరుపేటకు చెందిన ఇమ్మనేని చంద్రశేఖర్, చంద్రమతి దంపతులు మూడు లక్షల 50 వేల రూపాయల విలువచేసే 1500 గ్రాముల శిరోధారణను స్వామివారి కైంకర్యానికి వినియోగించే విధంగా ప్రత్యేకంగా తయారు చేయించి దేవస్థాన చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి చేతుల మీదుగా కార్యనిర్వహణాధికారి మమతకు అందజేశారు. ఈ శిరోధారను స్వామి వారికి ప్రతినిత్యం నిర్వహించే జలాభిషేకం నిర్వహించేందుకు ఉపయోగిస్తారు. ఈ కార్యక్రమంలో గుండుబోయిన సూర్య, గీత మాధురి, దేవస్థాన అర్చకులు పేటేటి సునీల్‌కుమార్ శర్మ, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు లీలా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో ఘనంగా మాస శివరాత్రి వేడుకలు



సూళ్లూరుపేట, జూలై 13 ప్రభాతవార్త: ఆరుద్ర నక్షత్రం మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సూళ్లూరుపేటలోని పలు శివాలయాల్లో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. శ్రీ నాగేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారికి అభిషేకంతో పాటు ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. అలాగే అభయ శంకర దేవస్థానంలో స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణలు చేశారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించు కున్నారు. నాగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, కార్యనిర్వహణ అధికారి మమత, దేవస్థాన ప్రధాన అర్చకులు పెటేటి సునీల్ కుమార్ శర్మ, అభయ శంకర దేవస్థానంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, పర్యవేక్షణలో అర్చకులు రమణయ్య పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

## శ్రీ చెంగాళమ్మ హుండీల ఆదాయం రు.65లక్షలు



సూళ్లూరుపేట, జూలై 13 ప్రభాతవార్త: శ్రీచెంగాళ మాతా పరమేశ్వరి దేవస్థా నంలో హుండీలను సోమ వారం లెక్కించారు. 110 రోజులకు గాను హుండీల ద్వారా 65లక్షల 52వేల 151 రూపాయలు ఆదాయంగా లభించింది. బంగారం 62.020 మిల్లి గ్రాములు, వెండి 150.050మిల్లీ గ్రాములు, యూఎస్ఏ డాలర్స్ 90, కెనడా 5,అరబ్ ధీ రామ్స్ 10 హుండీలలో భక్తులు సమర్పించారు. దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ బి. ప్రసన్న లక్ష్మి పర్యవేక్షణలో తిరుపతి గ్రూప్ దేవస్థానాల కార్య నిర్వహణ అధికారి ఇ.మునిశేఖర్ సమక్షంలో హుండీల లెక్కింపు జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి మహిళా సేవా సమితి సభ్యులు, మెప్మా సభ్యులు, శ్రీ చెంగాళమ్మ భక్త బృందం పాల్గొన్నారు.

## కాశీపురంలో సామూహిక అక్షరాభ్యాసం



వాకాడు, జూలై 13 ప్రభాతవార్త: మండలం కాశీపురం దళితవాడిలోని అంగన్వాడి కేంద్రం వద్ద సోమవారం ఎంవి రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు అవసరమైన పలకలు బలపాలను ఎంవి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ పంపిణీ చేశారు. తదుపరి వారిచే హిందూ సాంప్రదాయానికి అనుగుణంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంవి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి, అంగన్వాడీ కేంద్రం నిర్వాహకులు ఝాన్సీ, నేలమ్మ, గీత, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కరించాలి : ఎంపీడీవో



వెంకటగిరి, జూలై 13 ప్రభాతవార్త: మండలం లోని బ్యాండ్ పాలెంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఎంపీడీవో గుణశేఖర రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మోటర్ పనిచేయకపోవడం వల్ల తాగునీటి సమస్య ఏర్పడిందని వాడు తెలిపారు. బ్యాండ్‌పాలెంలోని అంగన్వాడి కేంద్రం ప్రాంతంలో ఆవులను రోడ్డుపైనే కోస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఆవులను చంపి రోడ్డుపైనే మాంసం విక్రయించి స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు చెప్పారు. చిన్నారులు అంగనవాడి కేంద్రం పాఠశాలలకు వెళ్లాలంటే భయపడు తున్నట్లు తెలిపారు. మాంస వ్యర్థాలు రోడ్డుపై పడేయడం వల్ల దుర్గంధపూరితమైన వాసన వస్తున్నట్లు చెప్పారు. గోవధ చట్టరీత్యా నేరమని తెలిసినా వారు వధిస్తున్నట్లు ఫిర్యాదుల పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాలని స్థానిక పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి ఆదేశించారు. వెంటనే గోవులను వధిస్తున్న వారికి నోటీసులు ఇచ్చి ఆపాలని తెలిపారు.

## అందుబాటులోకి రైల్వే ఓవర్ బ్రిడ్జి

వెంకటగిరి, జూలై 13 ప్రభాతవార్త: ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి చొరవతో రైల్వే గేటు సమస్య పరిష్కారం కావడంతో ప్రయాణికులు హర్షిస్తున్నారు. వెంకటగిరిఏర్పేడు మార్గం మధ్యలో ఉన్న రైల్వే గేటు వద్ద ప్రజలు ఎదుర్కొం టున్న ట్రాఫిక్ సమస్యను ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. రైల్వేశాఖ, జాతీయ రహదారుల శాఖ అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించి పనుల పురోగతిని పరిశీలించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులను నిరంతరం ఆదేశిస్తూ ఒత్తిడి తీసుకువచ్చారు. వెంకటగిరి ప్రాంత ప్రజాప్రతి నిధులు, స్థానిక నాయకులు తెలిపిన సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే వరకు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సంబంధిత శాఖలతో సమన్వయం కొనసాగించారు. ఎంపీ చొరవతో ఏర్పేడు రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తై ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.

# సూళ్ళూరుపేట డివిజన్

## నియోజకవర్గంలో నూరు శాతం ఫామ్స్ పంపిణీ

**- నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి భరత్ నాయక్**




వెంకటగిరి, జూలై 13 ప్రభాతవార్త: సర్ కార్యక్రమంలో నియోజకవర్గంలో నూరు శాతం ఫామ్స్ పంపిణీ చేశామని వెంకటగిరి నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి భరత నాయక్ తెలిపారు. వెంకటగిరి తాసిల్దార్ కార్యాలయంలో సర్ కార్యక్రమం పై ఆయన విలేకరుల సమావేశం నిర్వహిం చారు. నియోజకవర్గంలో 2, లక్షల 45 వేల 78 మంది ఓటర్లు, 298 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. నూరు శాతం పారాల పంపిణీ చేసినట్లు చెప్పారు. 37017 మందిని అడ్రస్ లేని తదితర కారణాలతో అందుబాటులో లేరని తెలిపారు. ఈనెల 14వ తేదీ లోపల తీసుకున్న దరఖాస్తులను ఓటర్లు బిఎల్ఓ వరకు చేర్చాలని చెప్పారు. వయసు ధ్రువీకరణ పత్రం పట్టాదారు పాస్ పుస్తకం కానీ, ఇంటి పట్టా బ్యాంకు పాస్ పుస్తకం తదితర వాటి ఉన్న సరిపోతుందని తెలిపారు. ఎవరి ఓటును తొలగించారని చెప్పారు. ఒకరికి ఒకచోట మాత్రమే ఓటు ఉండాలని రెండు చోట్ల పెట్టుకుంటే శిక్షార్హులని తెలిపారు. ఓటర్లు లందరూ విఆర్ఓలకు సహకరించాలని సూచించారు. 14 తేదీ రాత్రి 12 గంటల వరకు ఫామ్స్ తీసుకుంటారని తెలిపారు. సమావేశంలో తాసిల్దార్ పి శిరీష, మున్సిపల్ కమిషనర్ ఈగ కిరణ్, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పనులను పరిశీలించిన అధికారులు



వెంకటగిరి, జూలై 13 ప్రభాతవార్త: పట్టణాల్లో జరుగుతున్న దాసుదారు కార్యాలయం పనులను గాలేరు నగిరి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భరత్ నాయక్, తహసిల్దార్ పి.శిరీష పరిశీలించారు. పనులను పూర్తిగా తన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ శివారెడ్డిని ఆదేశించారు. నిర్మాణ పనులను లోపల తిరిగి పరిశీలిం చారు. పనుల్లో జరుగుతున్న జాప్యంపై కాంట్రాక్టర్‌ని అడిగి తెలుసు కున్నారు. బిల్లులు ఆలస్యమవుతున్నందున పనులు ఆలస్యంగా జరుగుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఈగ కిరణ్, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఫోటో

## గౌరవ వేతనాలు వెంటనే చెల్లించాలి

బాలాయపల్లి, జూలై 13 ప్రభాతవార్త: ఎంపీపీ, ఎంపీటీసీలకు 2025 జనవరి నుండి ఈ సంవత్సరం జూన్ వరకు ప్రభుత్వ గౌరవ వేతనాలు ఇవ్వలేదని ఎంపీపీ, ఎంపీటీసీలు వాపోయారు. ఎంపీపీ లకు నెలకు 6000, ఎంపీటీసీలకు 3000 రూపాయలు గౌరవ వేతనం ఇవ్వాలని తెలిపారు. తమ పదవీకాలం రెండు నెలల్లో ముగుస్తుందని వెంటనే ఇవ్వాలని వాడుకోరారు. ఎస్సీ, ఎస్టీ బీసీ ఎంపీటీసీలు అయిన తమను, ప్రభుత్వం పట్టించుకోవాలని కోరారు.

## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే పూర్తి



తడ, జూలై 13 ప్రభాతవార్త: యస్ఐఆర్‌కి సంబం ధించి డిజిటలైజషన్ అఫ్ ఏనుమరేషన్ ఫార్మ్ సర్వే తడ మండలంకు సంబంధించి 100 శాతం పూర్తి అయ్యిందని తడ ఎమ్మార్వో రవి కుమార్ తెలియ జేశారు. సోమవారం మండలంలోని వివిధగ్రామాల పోలింగ్ స్టేషన్ పరిధిలోని వివిధ రాజకీయ పార్టీలు నియమించబడిన బి.ఎల్.ఏ.లతో ఎమ్మార్వో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో మండ లంలో మొత్తం ఓటర్లు 35,888 ఉండగా వీరిలో మరణించిన వారు, వేరే ప్రాంతంకు వెళ్లినవారు, అదేవిధంగా డబల్ ఎంట్రీస్, మొత్తం 3,907 ఓటర్లు ఉన్నారని ఎమ్మార్వో తెలియజేశారు. జాబితాను బి.ఎల్.ఏలకు ఇవ్వడం జరిగిందని జాబితాను పంచాయతీ కార్యాలయం నందు స్వర్ణ గ్రామ సచివాలయం నందు ప్రచురించడం జరుగుతుందని తెలియజేశారు.

## డయల్ యువర్ సిఎండికి... 53 విద్యుత్ సమస్యలు




తిరుపతి జులై 13ప్రభాతవార్త: సోమవారం ఉదయం తిరుపతిలోని ఎస్పీడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో డయల్ యువర్ సిఎండి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి 53 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను సిఎండి శివశంకర్‌లోతేటికి విన్నవి ంచారు. వినియోగదారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# అరుదైన ఆరుద్ర...శివరాత్రిని మరిపించిన శివాలయాలు



శ్రీకాళహస్తి,జూలై 13 ప్రభాతవార్త: సోమవారం శివయ్యకు ప్రీతిపాత్రమైన రోజు అంటారు. ఆరోజు శివాలయాల్లో ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహిస్తుంటారు. పలువురు ఈ రోజు ఎంతో పవిత్రమైనదిగా భావించి పూజలు,అభిషేకాలు జరుపుతుంటారు. సోమవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆమావాస్య రావటంతో శ్రేష్టమైనదిగా ప్రచారం జరిపారు.దాంతో గ్రామాల నుంచి తండోప తండాలుగా భక్తులు కదలి వచ్చారు. మహాశేవాక్షయోగం పూజలను నిర్వహించారు. దాంతో చుట్టుపక్కల ఉన్న శివవాలయాలు భక్తులతో కిట కిట లాడాయి. ఈ రోజు ప్రాధాన్యత గురించి కొందరు అర్చకులు ప్రచారం చేస్తూ ఈ సోమవారం శివయ్యను దర్శించుకున్నా అన్నాభిషేకం చేసినా అన్నదానం చేసినా వంద శివరాత్రుల్లో దర్శించుకున్న అంత పుణ్యం వస్తుందని ప్రచారం చేసారు. దాంతో భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. మరో అడుగుముందుకేసి కృష్ణ చతుర్థి అరుద్ర కాబట్టి ఇది 225 సంవత్సరాల్లో మూడు సార్లుమాత్రమే వస్తుంది. అది కూడా సోమవారం అరుద్ర రావటం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని ప్రచారం చేసారు. మళ్ళీ 2053 తరువాత 2070లో మాత్రమే వస్తుందని ప్రచారం చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో అయితే 'శివరాత్రికి కూడా రానంతమంది' భక్తులు వచ్చారంటే ఈ రోజు ప్రాధాన్యత అర్థమౌతుంది. ఇక శ్రీకాళహస్తికి చుట్టుపక్కల ఉన్న పూడిలో స్వర్ణముఖి తీరాన వెలసిన అర్ధనారీశ్వరాలయం, మూకేశ్వరాలయం, బొక్కసం పాళెం, సంపతీశ్వరాలయం, శివాలయాలు ఓం కార నాదంతో పునీతమయ్యాయి. భక్తులతో కిట కిట లాడాయి.

**చైర్మన్ పరిశీలన:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తుల తాకిడి ముందుగానే గుర్తించటంతో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా సుదర్శనం కోసం స్వామి గర్భగుడి ముందు నిలబడి పర్యవేక్షించారు. సామాన్య భక్తులకు సుదర్శనం అవకాశం కల్పించుటకు ప్రయత్నిం చారు. అలాగే ఆలయం ఇఓ బికె వెంకటేశు కూడా ఆలయంలో తిష్టవేసి పర్యవేక్షించారు. సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి సుమారు 50వేల కుపైగా భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకొని ఉంటారని అంచనా.

## సర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్




రేణిగుంట జూలై 13 ప్రభాతవార్త: భారత ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియను పరిశీలించడానికి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేసుకొని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆకస్మికంగా రేణిగుంట పంచాయతీ కార్యాలయంలోని సచివాలయం 2కు వచ్చారు. కలెక్టర్ రాకతో భిన్న ధ్రువాలుగా ఉన్న రాజకీయ ప్రత్యర్థులు ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ, వైసీపీ పార్టీల నేతలు పంచాయతీ కార్యాలయం చేరుకున్నాయి. రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్, రేణిగుంట పట్టణ వైసిపి అధ్యక్షుడు ప్రభాకర్ తమ పార్టీకి చెందిన బూత్ లెవెల్ ఏజెంట్లతో కలెక్టర్ కు సర్ ప్రక్రియ వివరాలను తెలియ జేశారు. కలెక్టర్ సూచనలను విన్నారు. సర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని బూతు లెవల్ ఏజెంట్లకు సూచించారు. ఒక ఓటరుకు రెండు చోట్ల ఓట్లు ఉంటే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఈనెల 14వ తేదీలోగా ప్రక్రియ పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. జూలై 21వ తేదీ నుండి ఆగస్టు 21వ తేదీ వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఓటు హక్కు కోల్పోయిన వారు ఫాం సిక్స్ ద్వారా ఆధారాలు చూపించి ఓటు హక్కు పొందే అవకాశం ఉందన్నారు. చనిపోయిన వారు, శాశ్వతంగా మైగ్రేషన్ అయిన వారి వివరాలు సేకరించాలన్నారు. ఇప్పటివరకు 99 శాతం డిజిటైజేషన్ పూర్తయిందన్నారు. కార్యక్రమంలో ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, తహసిల్దార్ శ్రావణ్ కుమార్, టిడిపి నేతలు డి పుష్పనాదం, వైసిపి నేతలు ఇన్బానాదన్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో మాస శివరాత్రి ఉత్సవాలు



పుత్తూరు రూరల్, జూలై 13 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మాస శివరాత్రి స్వామివారి జన్మనక్షత్రం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఉదయం ఆలయంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామికి, అలాగే పరివార దేవతలు కూడా అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు చేశారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మండల పరిధిలోని తొరూరు, నేసనూరు, వేపగుంట, చిన్నబ్బనాయుడు కండ్రిగ, తిరుమలకుప్పం గ్రామాల్లోని శివాలయాలు భక్తుల తాకిడి అధికమైంది. భక్తులు స్వామివారికి, అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## పరమేశ్వరుడి జన్మ నక్షత్రం ఆరుద్ర...

**భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు**



చంద్రగిరి, జూలై 13 ప్రభాతవార్త: పరమేశ్వరుడు జన్మించిన ఆరుద్ర నక్షత్రం, సోమవారం, మాస శివరాత్రి, కృష్ణపక్ష చతుర్ధశి తిధి ఇలా అన్నీ ఒకే రోజున కలిసి రావడం అరుదుగా జరుగుతుందని పండితులు అంటు న్నారు. పురాణాలను పరిశీలిస్తే 225 ఏళ్ళలో కేవలం 9 సార్లు మాత్రమే ఈ విధమైన ప్రత్యేకత ఏర్పడినట్లు వెళ్ళడిస్తున్నారు. దీనినే అరుదైన మహా శైవాఖ్య యోగమని వివరిస్తున్నారు. ఈ పవిత్రమైన రోజున శివారాధన చేయడం ద్వారా వంద మహాశివ రాత్రులు పూజలు చేసిన పుణ్యఫలాన్ని పొందవచ్చని అంటున్నారు. దీర్ఘకాలిక అనారోగ్యం, శత్రుపీడ, మానసిక ఆందోళన, ఆర్థిక ఇబ్బందులు వంటి సమ స్యలతో బాధపడే వారికి విముక్తి లభిస్తుందం టున్నారు. మండల పరిధిలోని తొండవాడ ముక్కోటి అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయం, చంద్రగిరి పుట్టాలమ్మ, శేషాపురం శివాలయంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. పవిత్రమైన రోజు కావడంతో శైవ క్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి.

## స్వామి వారికి ప్రత్యేక పూజలు



రామచంద్రాపురం, జూలై 13 ప్రభాతవార్త: బొప్పరాజుపల్లి సమీపంలో వెలసియున్న శ్రీ స్వయంభు బుగ్గమల్లేశ్వర స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన మాస శివరాత్రి ప్రదోష కాల ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని వేదపండితులు వేదమంత్రోచ్చారణల నడుమ వివిధ సుగంధ భరిత పరిమళ ద్రవ్యాలు, పుష్పాలు, పవిత్ర బిల్వ పత్రాలతో అభిషేకాలు నిర్వహించారు. బొప్పరాజుపల్లి గ్రామానికి చెందిన కుమ్మర మల్లయ్య కుమారుడు కుమ్మర నాదముని దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. పూజల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ నేపథ్యంలో ఆలయ ప్రా ంగణంలో నిర్వహించిన కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

## ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాత విచారణ

తిరుపతి,జులై 13ప్రభాతవార్త: పిజిఆర్ఎస్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదుపై చట్టపరంగా, నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి త్వరితగతిన పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు అధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 66 ప్రజా ఫిర్యాదుల స్వీకరించారు. ఫిర్యాదుదారుల వినతులను ఓర్పుతో ఆలకించిన జిల్లా ఎస్పీ,ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవి మనోహరచారి , శ్రీలత, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గోమాత సకల దేవతల ఆవాసం



రేణిగుంట జూలై 13 ప్రభాతవార్త: సకల దేవతలకు ఆవాసం గోమాత అని బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు, ముదిరాజ్ సంఘం జిల్లా కన్వీనర్ వేణుగోపాల్ ముదిరాజ్ మాతృమూర్తి కుర్ర కాలవ మాజీ సర్పంచి రాణమ్మ అన్నారు. రేణిగుంట మండలం జిపాలెం కుర్ర కాలవ నందు సోమవారం 100 సంవత్సరాలకి ఒక్కసారి వచ్చే మహా మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరిం చుకొని ఘనంగా గోపూజ నిర్వహించారు. ఆడపడుచులకు ఏ విధంగా సీమంతాలు నిర్వహిస్తారో అదే రీతిలో సూడితో ఉన్న గోవులకు సీమంతాలు నిర్వహించారు. అనంతరం సకల దేవతా స్వరూపమైన గోమాతలకు ఘనంగా పూజలు చేశారు. అనంతరం ఆవులకు వివిధ రకాలైన తినుబండారాలు, పిండి వంటలు, పండ్లు నైవేద్య రూపంలో సమర్పించారు.

## కన్నుల పండువగా అమావాస్య ఉత్సవం



శ్రీకాళహస్తి,జూలై 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో సోమవారం రాత్రి అమావాస్య సందర్భంగా స్వామి అమ్మవార్ల ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహిం చారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. సాధారణంగా ప్రతి అమా వాస్య సందర్భంగా రాత్రి గ్రామోత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఈనేపథ్యంలో సోమవారం రాత్రి ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను ముస్తాబు చేసారు. బోయిలు మోసుకుంటూ తేరువీధిలోని అలంకార మండపం వద్దకు చేర్చి ఉత్సవాన్ని ప్రారంభించారు. కాగా ఉత్సవాన్ని ఆలయ ఇన్స్పెక్టర్ హరియాదవ్ పర్యవేక్షించారు.

## కరుమారియమ్మ దేవాలయంలో... ఆడి నెల మహోత్సవాలు



తిరుపతి,జులై 13ప్రభాతవార్త: తిరుపతి తిలక్ రోడ్డులోని కరుమారియమ్మ దేవాలయంలో జులై 17 నుండి ఆగస్టు16 వరకు నెల రోజుల పాటు అత్యంత వైభవంగా ఆడినేల మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త జి. నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో బిజెపి నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి, ఆలయ అర్చకులు వేలాయుధం, ల తో కలిసి ఈ మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జులై 17వ తేదీ శుక్రవారం ఉదయం 5 గంటలకు పాలకుండల మహోత్సవం మంచినీళ్ల కుంట శివాల యం వద్ద నుండి ప్రారంభమవుతుంది. రామచంద్రపుష్కరిణి, రాముల వారి ఆలయం, కోదండరామస్వామి ఆలయం నుండి తిలక్ రోడ్డులోని కరుమారియమ్మ దేవాలయం వరకు భక్తులు భారీగా పాలకుండలతో ఊరేగింపుగా చేరుకుని అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, ఆలయ అర్చకులు వేలాయుధం, రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు గుణ, బాబు, ఆనందు, వెంకటేశ్వర్లు, మునస్వామి, ఈశ్వర్, బాలాజీ, లోకేష్, వాసు, మునిరాజా, జనార్దన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, కే ఎన్ రాజా, కేశవులు వడియార్, విగ్రహాల కళ్యాణి, మహాలక్ష్మి ౖ, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, దీన దయాల్, పురోహితుడు సురేష్ స్వామి పాల్గొన్నారు.